రక్షానుబంధన్..

- అన్నాచెల్లెళ్ల ప్రేమకు ప్రతిరూపం
- నేడు రాఖీ పండగ
- హాట్‌కేకుల్లా గ్రీటింగులు, రాఖీలు, గిఫ్ట్ ఆర్టికల్స్ విక్రయాలు



- 6వ పేజీలో..

బదిలీల జాతర

ప్రభుత్వ ఉద్యోగుల స్థానచలనానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- నేటి నుంచి దరఖాస్తులకు అవకాశం
- నెలాఖరు వరకు గడువు
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ప్రక్రియ
- సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):

ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేస్తారు. బదిలీ కోరుకున్న సమయంలో జీరో సర్వీసును కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. నెలాఖరు వరకు సంబంధిత విభాగాధిపతికి అందజేసేందుకు గడువుంది.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో మూడు జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ కోరుకునే వెసులుబాటు కల్పించినట్టయింది. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం జిల్లాల విభజన సమయంలో నగరం నుంచి అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు వెళ్లిన అధికారులు, ఉద్యోగుల్లో అధికశాతం మంది మైదానం/ నగరానికి రావడానికి ఉత్సాహం చూపిస్తున్నారు.

సిఫారసులకు క్యూలు

బదిలీల కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన వెంటనే అధికారులు, ఉద్యోగులు కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కీలక ప్రాంతాల్లో పోస్టింగ్ కోసం సిఫారసు లేఖలు పొందేందుకు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇందులో భాగంగా కొందరు అధికారులు/ఉద్యోగులు విశాఖలోని ప్రజాప్రతినిధుల నుంచి ఇప్పటికే లేఖలు తీసుకున్నట్టు సమాచారం.

జీవీఎంసీ పరిధి యూనిట్‌గా..

ఒకే చోట ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగికి బదిలీ తప్పనిసరి. అయితే జీవీఎంసీ పరిధిని మొత్తం ఒక యూనిట్‌గా పరిగణిస్తారని ఉద్యోగులు చెబుతున్నారు. ఉదాహరణకు రెవెన్యూ ఉద్యోగులు కలెక్టరేట్‌తోపాటు విశాఖ పరిధిలోని పలు తహసీల్దార్ల కార్యాలయాల్లో పనిచేసిన కాలాన్ని మొత్తంగా లెక్కిస్తారంటున్నారు. దీని వల్ల నగరంలో రెవెన్యూతో పాటు పలు శాఖల ఉద్యోగులు అనకాపల్లి, పాడేరు ఏజెన్సీకి బదిలీకి అర్హులంటున్నారు. ఏళ్లుగా నగరంలో తిష్టవేసిన ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనని ఓ సీనియర్ ఉద్యోగి తెలిపారు. బదిలీల్లో ముందుగా పాడేరు ఐటీడీఏ పరిధిలో ఖాళీలు భర్తీచేయాలని తాజాగా విడుదలచేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది. అటు తరువాతే మైదానం/నగరంలో ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఏజెన్సీలో పనిచేసిన ఉద్యోగులు/అధికారులు బదిలీ కోరుకుంటే.. కనీసం రెండేళ్లు అంతకంటే ఎక్కువగా పాడేరు ఐటీడీఏ పరిధిలో సర్వీసు పూర్తిచేసుకున్నవారు, 50 ఏళ్ల వయసు పైబడిన వారు అర్హులు. ఏజెన్సీ నుంచి మైదానానికి వచ్చే



ఉద్యోగి/ అధికారి విధిగా అతని స్థానంలో పోస్టింగ్ పొందిన ఉద్యోగి/అధికారికి బాధ్యతలు అప్పగించాలి. అంటే రిలీవర్ వస్తేనే మార్పునకు అవకాశం ఉంటుంది. కాగా ఉద్యోగ సంఘాల్లో బాధ్యులుగా పనిచేసే (అధ్యక్ష, కార్యదర్శి, ఇతర సభ్యులు) ఉద్యోగుల విషయంలో కనీసం తొమ్మిదేళ్ల వరకు ఒకేచోట పనిచేసుకునే అవకాశం కల్పించారు. కానీ విశాఖలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగ సంఘాల ఎన్నికలు ఫార్స్‌గా మారాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మినహాయింపులపై అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

తహసీల్దార్లకు వర్తిస్తాయా?

విశాఖ జిల్లాలో గత నెలలోనే తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు డివిజన్ పరిధిలో తహసీల్దార్ల బదిలీలకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో మూడు వారాలుగా పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్నారు. అయితే శనివారం కోడ్ ఎత్తివేయడంతో ఈ జిల్లాల్లో తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. కాగా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా బదిలీలు చేపట్టాలన్న తాజా ఉత్తర్వుల మేరకు తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది.

ఏజెన్సీలో రెండేళ్లకు పైగా సర్వీసు పూర్తిచేసిన వారు, 50 ఏళ్ల వయసు దాటిన అధికారులను మైదానానికి తీసుకురావాలి. దీనిని పరిగణనలో తీసుకుంటే ఏజెన్సీలో ఈ ఏడాది జనవరి 30 వరకు పనిచేసిన వారంతా మైదానికి రావడానికి అర్హులు. అంతేకాకుండా జిల్లాల విభజన సమయంలో ఇచ్చిన పోస్టింగ్స్‌లో ఉద్యోగులు/అధికారులను మూడు కేటగిరీలుగా విభజించారు. సర్వీసులో అత్యంత సీనియర్లను విశాఖలోనూ, సీనియర్లను అనకాపల్లి, జూనియర్లను అల్లూరి జిల్లాలకు పంపారు. అయితే 2022 ఏప్రిల్ తరువాత జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు వచ్చినపుడు విశాఖ జిల్లాలోనే పోస్టింగ్స్ ఇచ్చారు. వాస్తవంగా వీరిని పాడేరు డివిజన్‌కు పంపాలి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు చేపడుతున్న నేపథ్యంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో తహసీల్దార్ల పోస్టింగ్స్ కూడా విశాఖ కలెక్టరే చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే ప్రక్రియ పూర్తిచేసిన విశాఖ జిల్లాను కూడా ఈ బదిలీల్లో పరిగణనలోనికి తీసుకుంటారా?, లేక మినహాయింపు ఇస్తారా? అనేది తేలాల్సి ఉంది. కాగా అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో పనిచేస్తున్న 13 మంది తహసీల్దార్లు విశాఖలో పోస్టింగ్స్ కోసం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

జ్వరం, దద్దుర్లు

మోకాళ్లు, చేతులు, కాళ్లపై పొక్కులు, నోటిలో అల్సర్లు



- ఇటీవల చిన్నారుల్లో కనిపిస్తున్న లక్షణాలు
- వైరల్ ఇన్‌ఫెక్షన్ అంటున్న వైద్యులు
- ఎగ్జాంతమాగా పేర్కొంటున్న నిపుణులు
- అరి కాళ్లు, పాదాల్లో పొక్కులతో వేధిస్తున్న డిసీజ్

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):

నగర పరిధిలోని చిన్నారులను వైరల్ ఇన్‌ఫెక్షన్స్ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ పరిస్థితులు ఎదురవుతున్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇన్‌ఫె క్షన్స్‌తో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని చెబుతున్నారు. ఈ ఇన్‌ఫెక్షన్స్ ను ఎగ్జాంతమాగా పిలుస్తారని తెలిపారు. దీని బారినపడిన చిన్నారుల్లో జలుబు, జ్వరంతో పాటు శరీరంపై ఎర్రని దద్దుర్లు వేధిస్తున్నాయి. ఎక్కువ మంది చిన్నారు ల్లో పొట్ట, మోకాళ్ల భాగంలో దద్దర్లు, నోటిలో అల్సర్లు వస్తున్నాయి. సాధారణంగా ఈ లక్షణాలు మూడు నుంచి వారం రోజుల్లో తగ్గిపోతుంటాయని, అంతకు మించి వేధిస్తే నిపుణులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

ప్రతిరోజూ పీడియాట్రిక్ నిపుణుల వద్దకు వచ్చే కేసుల్లో దాదాపు 70 శాతం కేసులు ఇవే ఉంటున్నాయి. సాధారణంగా జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఈ తరహా కేసులు కనిపస్తుంటాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది అధికంగా కేసులు నమోదవుతున్నాయంటున్నారు. ఇంట్లో ఒకరికి వస్తే మిగిలిన చిన్నారులకు, వారి తో కలిసి ఉండే వారికి వేగంగా వ్యాప్తి చెందుతాయని హెచ్చరిస్తున్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే జాగ్రత్తలు పాటించాలని, మిగిలిన చిన్నారులను దూరంగా ఉంచాలని సూచిస్తున్నారు.

హెచ్‌ఎంఎఫ్ డిసీజ్ కూడా..

నగర పరిధిలోని చిన్నారుల్లో హెచ్‌ఎంఎఫ్ డిసీజ్ ఎక్కువగా కనిపిస్తోంది. దీనినే హ్యాండ్, మౌత్, ఫుట్ డిసీజ్‌గా పేర్కొంటారు. ఈ వ్యాధి బారినపడిన చిన్నారుల నోటిలో అల్సర్లువస్తాయి. అరచేయి, పాదాల్లో ఎర్రని పొక్కులు, బొబ్బలు వస్తాయి. ఈ లక్షణాలు వచ్చిన చిన్నారులు తినడానికి, పాలు తాగేందుకు కూడా తీవ్రంగా

... మిగతా 4వ పేజీలో

వైద్యులను సంప్రదించాలి



వాతావరణ మార్పులతో పిల్లల్లో కొన్ని రకాల ఇబ్బందులు వస్తున్నాయి. వీటిలో ఎగ్జాంతమా ఒకటి. ఈ వైరస్ బారినపడిన చిన్నారుల నోటిలో, శరీరంపై దద్దుర్లు వస్తున్నాయి. రాత్రిపూట తీవ్రంగా ఏడుస్తుంటారు. తాగేందుకు, తినేందుకు ఇబ్బంది పడుతుంటారు. తినేం దుకు ఇబ్బంది పడితే నోటిలో అల్సర్లు ఉన్నట్టు అనుమా నించాలి. వెంటనే వైద్యుల వద్దకు వెళ్లాలి. హెచ్‌ఎంఎఫ్ డిసీజ్ కూడా కనిపిస్తోంది. చిన్నారులు అరిచేతులు, పాదాల్లో ఎర్రని పొక్కులు కనిపిస్తాయి. మందులు వేస్తే వారం నుంచి పది రోజుల్లో నయం చేయవచ్చు. డెంగీ ఫీవర్, చికెన్ పాక్స్‌లో ఈ తరహా లక్షణాలుంటాయి. వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించడం మంచిది.

- డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, పిల్లల వైద్య నిపుణులు, ఘోషా ఆస్పత్రి



బీచ్ రోడ్డులో వైద్యుల నిరసన

- కోల్‌కతా ఘటనను నిరసిస్తూ భారీ ర్యాలీ

- వార్త 4లో



చోరీకి గురైన పెందుర్తిలోని ఎస్‌బీఐ ఏటీఎం

చెలరేగిన దొంగలు

పెందుర్తి, తగరపువలస ఎస్‌బీఐ ఏటీఎంలు కొల్లగొట్టి రూ.33 లక్షలు చోరీ

- గ్యాస్ కట్టర్‌లతో యంత్రాలను కట్ చేసిన ఆగంతకులు
- అంతర్రాష్ట్ర ముఠా పనేనంటున్న పోలీసులు

- వివరాలు మెయిన్ 11లో




గ్యాస్ కట్టర్‌తో కట్ చేసిన తగరపువలస అవంతి కళాశాల సమీపంలోని ఏటీఎం కేంద్రం

బకాయిలు చెల్లించరా?

జలవనరుల శాఖకు జీవీఎంసీ ఝలక్

- ఏడాది పొడవునా నీరు సరఫరా చేస్తున్నా చెల్లింపుల్లేవ్
- పెండింగ్‌లో రూ.211.23 కోట్లు
- అత్యవసర మరమ్మతులకూ నిధులు విదల్చని అధికారులు
- భారంగా మారిన ప్రాజెక్టుల నిర్వహణ



రైవాడ జలాశయం

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):

విశాఖ మహానగరానికి తాగునీటిని సరఫరా చేస్తున్న జలవనరుల శాఖకు జీవీఎంసీ ఝలక్ ఇస్తోంది. ఏటా బకాయిలు పేరుకుపోతున్నా చెల్లింపుల ఊసెత్తడం లేదు. ఏటా ఎంతో కొంత మొత్తం చెల్లించాలని ఆ శాఖ విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదు. తాటిపూటి మినహా రైవాడ, మేహాద్రి, గంభీరం ప్రాజెక్టుల నుంచి నీటిని సరఫరా చేస్తున్నా చెల్లింపులు చేయడంలేదు. ఇప్పటికే రూ.211.23 కోట్ల బకాయి పడడంతో ప్రాజెక్టుల నిర్వహణ కత్తి మీద సాములా పరిణమిస్తోంది.

విశాఖ మహా అవసరాలకు విశాఖ పరిసరాల్లోని గంభీరం, మేహాద్రిగెడ్డ తరువాత తాడిపూటి, రైవాడ ప్రాజెక్టుల నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. 1968లో తాటిపూడి, 1977లో మేహాద్రిగెడ్డ, 1978లో రైవాడ ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి. వీటిని జలవనరులశాఖ నిర్మించినా అధికశాతం నీరు విశాఖ నగర అవసరాలకే సరఫరా అవుతోంది. ఆది నుంచీ ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను జలవనరులశాఖ పర్యవేక్షిస్తోంది. ప్రతి ప్రాజెక్టుకు ఇంజనీర్లు, సహాయకులు, టెక్నీషియన్లు, హెల్పర్లను ప్రభుత్వం కేటాయించింది. దీనికితోడు ప్రాజెక్టుల నిర్వహణ, విద్యుత్ సరఫరాకు రూ. కోట్లు వెచ్చించింది. విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా డీజిల్ జనరేటర్లు కూడా అందుబాటులో ఉంచింది. వరదల సమయంలో గేట్లు ఎత్తడానికి ఇవి అవసరం కావడంతో ఎప్పటికప్పుడు డీజిల్ కూడా సిద్ధంగా ఉంచుతారు. ప్రాజెక్టులు నిర్మించి దశాబ్దాలు గడిచాయి. సిబ్బంది క్రమేణా ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వారి స్థానంలో కొత్త నియామకాల్లేవు. ఇదే సమయంలో ప్రాజెక్టుల నిర్వహణకు ప్రభుత్వం నిధుల విడుదలను తగ్గిస్తూ వచ్చింది. చివరకు విద్యుత్ బిల్లులు పేరుకుపోవడంతో సరఫరాను ఎప్పటికప్పుడు నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల ద్వారా సరఫరా చేస్తున్న నీటికి చెల్లింపులు జరపాలని 2008 నుంచి జీవీఎంసీకీ జలవనరులశాఖ అధికారులు లేఖలు రాస్తున్నారు. అయినప్పటికీ తాటిపూడికి తప్ప మిగిలిన ప్రాజెక్టులకు చెల్లింపులు జరగడం లేదు.

డబ్బులివ్వకున్నా... నీటి సరఫరా

బకాయిలు ఇచ్చేదిలేదు... పదేపదే తమ వద్దకు రావద్దని సుమారు పదేళ్ల క్రితం అప్పటి జీవీఎంసీ కమిషనర్ జలవనరులశాఖ ఎస్ఈ, ఈఈకు తెగేసి చెప్పేశారు. ఎవరికి చెప్పినా పైసా

... మిగతా 4వ పేజీలో

లాడ్జిల నిర్వహణ ఇష్టారాజ్యం

గుట్టుగా అసాంఘిక కార్యకలాపాలు

- పేకాట, వ్యభిచారానికి చిరునామాగా మారుతున్న వైనం
- డబ్బులిస్తే నిబంధనలు బేఖాతర్
- మొక్కుబడిగా రికార్డుల నిర్వహణ
- చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న పోలీసులు
- సీపీ చొరవతో కొన్ని లాడ్జిల బాగోతం బట్టబయలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో లాడ్జిల నిర్వహణ ఇష్టారాజ్యంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్వాహకులతో స్థానిక పోలీసులు మిలాఖత్ అవడంతో నిబంధనలను గాలికి వదిలేసి వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బు సంపాదనే ధ్యేయంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుస్తున్నారని సమాచారం. కొన్ని లాడ్జీలు పేకాట, వ్యభిచారానికి చిరునామాగా మారాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 16న నగరంలోని లాడ్జిలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సీపీ ఆదేశించడంతో కొన్నింటి బాగోతాలు బయటపడ్డాయి.



నగరంలోని లాడ్జిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్ ఫొటో)

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో లాడ్జిలు, హోటల్ రంగం విస్తరిస్తోంది. విద్య, వైద్య, వ్యాపార, ఉద్యోగ అవసరాల నిమిత్తం రాష్ట్రం నలుమూలల నుంచి నగరానికి ఎంతో మంది వస్తుంటారు. దీనితోపాటు పర్యాటకప్రాంతంగా గుర్తింపు ఉండడంతో దేశవిదేశాల నుంచి పర్యాటకులు సందర్శిస్తుంటారు. దీంతో లాడ్జిలు, హోటళ్లకు డిమాండ్‌ఉంటోంది. స్టార్‌హోటళ్లను మినహాయిస్తే చిన్న, మధ్యతరహా లాడ్జిలు, హోటళ్లు 400కిపైగా ఉన్నాయి. వీటిలో అత్యధికంగా రైల్వేస్టేషన్, ఆర్టీసీకాంప్లెక్స్, కేజీహెచ్ పరిసరాల్లోనే ఉన్నాయి. ఆస్పత్రులు, పోటీపరీక్షలు, పర్యాటకం కోసం నగరానికి వచ్చేవారిలో తక్కువ అద్దె వసూలుచేసే లాడ్జిల్లో బసచేసేందుకు మొగ్గుచూపుతారు. దీనిని ఆసరాగా తీసుకుని నగరంలోని కొన్నిలాడ్జిల నిర్వాహకులు గదులను రోజంతా కాకుండా ముందుగానే ఖాళీ చేసేస్తారంటే వారికి ఎలాంటి వ్యక్తిగత గుర్తింపు కార్డులు అడగకుండానే గదులను కేటాయించేస్తున్నారు. దీనివల్ల పేకాటరాయుళ్లు, వ్యభిచారులు, గంజాయి రవాణా చేసేవారు సురక్షిత స్థావరాలుగా మార్చుకుంటున్నారు.

రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉన్న హోటళ్లలో సగానికిపైగా లాడ్జిలు చూడడానికి ఇళ్ల మాదిరిగానే కనిపిస్తాయి. ఆర్టీసీకాంప్లెక్స్ పరిసరాలు, గాజువాకతోపాటు శివాజీపాలెం, ఎంవీపీకాలనీ, మహారాణిపేట, డాబాగార్డెన్స్, అల్లిపురం ప్రాంతాల్లో కొన్ని లాడ్జిలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారుతున్నాయి. ఎవరైనా వచ్చి తాము పేకాట ఆడుకుని

... మిగతా 4వ పేజీలో

పెందుర్తి-అరకు రోడ్డుకు మహర్దశ

- రూ.935.76 కోట్లతో బౌడారా రోడ్డు విస్తరణకు మోక్షం

పెందుర్తి, ఆగస్టు 18: జిల్లాలోని పెందుర్తి జంక్షన్ నుంచి విజయనగరం జిల్లా కొత్తవలస మీదుగా ఉన్న బౌడారా ఎన్‌హెచ్ 516 విస్తరణకు మోక్షం లభించనుంది. భారతమాల పరియోజన పథకం కింద సుమారు 45 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ రహదారికి 516బి నంబరు కేటాయించి, నాలుగు వరసలుగా అభివృద్ధి చేయనున్నారు. పెందుర్తి నుంచి కొత్తవలస, శృంగవరపుకోట మీదుగా అరకు చేరే బౌడారా 516ఈ జాతీయ రహదారిని కలిపే విధంగా అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం భూసేకరణ, పునరావాసం, నిర్మాణానికి రూ.935.76 కోట్లు ఖర్చవుతుందని జాతీయ రహదారి సంస్థ అంచనా వేసింది. 2023లోనే ఈ రోడ్డు పనులకు ఆమోదం లభించినా ఇప్పటివరకు కేవలం రూ 11.81 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. ప్రస్తుతం ఈ రహదారిలో రూ.782 కోట్లతో చేపట్టనున్న పనులకు టెండర్లను ఆహ్వానించారు. ఈనెల 28న కాంట్రాక్టర్‌ను ఖరారు చేసి రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నారు. మొదటి విడతగా ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులకు కేంద్రప్రభుత్వం రూ.181.22 కోట్లు కేటాయించింది.

ఆదిలోనే సర్వేకు అడ్డగింత

రహదారి విస్తరణకు సంబంధించి గత ఏడాది డీపీఆర్ మ్యాపింగ్ సర్వే చేపట్టారు. మండలంలోని సరిపల్లిలో జాతీయ రహదారుల

... మిగతా 4వ పేజీలో



పెందుర్తి-అరకు-బౌడారా రోడ్డు

కనకమహాలక్ష్మి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



పూజల్లో కుటుంబ సమేతంగా హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి

జగదాంబ కూడలి, ఆగస్టు 18: శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. న్యాయమూర్తికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. సహాయ కమిషనర్ వి. రాంబాబు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, న్యాయశాఖ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక జీవనాన్ని అలవరచుకోవాలి'



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 18: ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక జీవనం గడపాలని వక్తలు అన్నారు. ఆదివారం నాట్య పరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రతినిధులు కేపీ లిపిరెడ్డి, వై.బాలగణేష్ ఆధ్వర్యంలో అష్టోత్తర శత సంగీత నృత్యార్చన నిర్వహించారు. నగరంలోని గత 35 ఏళ్లుగా ఆధ్యాత్మిక రంగంలో సేవలందిస్తున్న ఎం.వి.రాజశేఖర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి.సందీప్, బి.వి. సూర్యరం, కె.సత్యనారాయణ, వెంకటరమణాచార్యులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ సేవా కార్యక్రమాలపై సెమినార్




సెమినార్ ప్రారంభిస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట, ఆగస్టు 18: జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విశాఖ జోన్ అధ్యక్షుడు గొంపా సురేష్ తెలిపారు. ఆదివారం మహారాణిపేటలోని ఓ హోటల్‌లో జేసీఐ అవార్డు ఓరియంటేషన్ సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ చాప్టర్ పరిధిలో పనిచేస్తున్న పలు సంఘాల ప్రతినిధులను గుర్తించి వారికి అవార్డులను అందించే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో రూపా సిరిపూరి, దిలీప్‌కుమార్, ఎస్. అనురాధ, సోమశేఖర్, రంజిత్ షా, పీటర్ మదన్, ఉమా, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిమితిస్థాయిలోనే గంటల మోత!

- జగదాంబ వద్ద క్లాక్‌టవర్ పనితీరు
- జంక్షన్ పరిధిదాటి వినిపించని శబ్దం
- తక్కువ సామర్థ్యంగల బ్యాటరీ, మిషనరీతో సమస్య.. నాణ్యతపై అనుమానాలు



జగదాంబ జంక్షన్‌లో క్లాక్ టవర్

జగదాంబ కూడలి, ఆగస్టు 18: జగదాంబ జంక్షన్‌లో ఎంతో అట్టహాసంగా జీవీఎంసీ ఏర్పాటు చేసిన క్లాక్ టవర్ నిర్మాణంలో నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. ఈ టవర్ నుంచి గంటల శబ్దం ఆ జంక్షన్ వరకే పరిమితం కావడంతో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ శబ్దం వన్‌టౌన్ వరకు మారుమ్రోగుతుందని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ క్లాక్ టవర్ తొలుత ఒప్పందానికి అనుగుణంగా నిర్మాణం సాగలేదని ఆరోపణలు వస్తున్నాయి.టవర్‌లోని మిషనరీ, బ్యాటరీ సామర్థ్యం, గంటల శబ్దంనకు చెందిన సాంకేతికస్థాయి తగ్గించి ఏర్పాటు చేయడంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్టు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. దాదాపు రూ. 2 కోట్లతో క్లాక్ టవర్‌కు వెచ్చించినట్టు తెలిసింది. ఈ నిర్మాణ బాధ్యతలను భువనేశ్వర్‌లోని తాచ్‌వాచ్ అండ్ ఎలక్ట్రానిక్స్ సంస్థ చేపట్టింది. ముంబాయి లోనిఎలక్ట్రానిక్‌సంస్థ నుంచి అవసరమైన యంత్రాలను దిగుమతి చేసుకున్నారు. ముందుగా చేసుకున్న ఒప్పందాన్ని పక్కపెట్టి తక్కువ సామర్థంగల పరికరాలు అమర్చడంతోనే శబ్దంమరీ వినిపించీ వినపించనదిగా వస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేజీహెచ్ సమీపంలోని వాచ్‌మేకర్ జపురుల్లా ఖాన్ వద్ద ప్రస్తావించగా, తక్కువ సామర్థ్యంగల పరికరాలతోనే గంటల శబ్దం పరిమితిలో ఉంటుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. క్లాక్ టవర్ ప్రమాణాలపై అప్పటి జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మ జోక్యం చేసుకున్నట్టు అనుమానాలు వ్యక్తంమవుతున్నాయి. ఈ లోపాలను సరిచేసి గంటల శబ్దం పెద్దగా వినిపించేలాచూడాలని నగరవాసులు కోరుతున్నారు.

డ్రస్ మేకింగ్, కోపా ట్రేడుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

కంచరపాలెం, ఆగస్టు 18 : కంచరపాలెం బాలికల ఐటీఐల్లో రెండో విడత కౌన్సెలింగ్‌లో మిగులు సీట్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ వరకు గడువు ఉంది. అభ్యర్థులు ఈనెల 27వ తేదీ లోగా సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల్లో అన్నీ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవాలని సూచించారు. వీరికి ఈనెల 29న బాలికల ఐటీఐ ప్రాంగణంలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.



కళాకారుల కోసం రూపొందించిన ట్రోఫీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నేడు పోలీస్ కమిషనరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో గత రెండు వారాలుగా కార్యక్రమాన్ని నిర్వహించలేదన్నారు. కోడ్ ముగిసినందున ఇకపై ప్రతి సోమవారం యథావిధిగా ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. జీవీఎంసీలో కూడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి ఒంటిగంట మధ్యలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాల్‌కు వచ్చి ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈసందర్భంగా కోరారు.

22న ఉత్తరాంధ్ర జానపద జాతర

సీతంపేట, ఆగస్టు 18: ఉత్తరాంధ్ర కళలు, జానపద కళాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఈ నెల 22వ తేదీన జానపద జాతరను నిర్వహిస్తున్నట్టు రైటర్స్ అకాడమీ ఛైర్మన్, ఉత్తరాంధ్ర జానపద జాతర నిర్వాహక కమిటీ డైరెక్టర్ బీవీ రమణమూర్తి తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఈనెల 22న సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఈ జానపద జాతర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో నగరంలోని అన్ని కళా సంస్థలూ భాగస్వామ్యం కానున్నాయన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు బీచ్‌రోడ్డులో విశ్వప్రియ ఫంక్షన్ హాలు నుంచి 40కి పైగా జానపద నృత్యాలు, 3వేల మంది కళాకారులతో ర్యాలీ గురజాడ కళాక్షేత్రం వరకు సాగుతుందన్నారు. సాయంత్రం చిన్న తాళం, భజన, చెక్క భజన, పులివేషాలు, కర్రసాము, కత్తిసాము, తూర్పు బాగోతం, సవర ఆగం, థింసా నృత్యాలు, పొడుగు కాళ్లు, జాలరి నృత్యం, రైతు నృత్యం, జముకు పాట ఇలా ఉత్తరాంధ్ర జానపద కళాకారుల నృత్యాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా సినీ హాస్యనటుడు బ్రహ్మానందంహాజరుకానున్నారన్నారు. సమావేశంలో పలు కళా సంస్థల ప్రతినిధులు,సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించరా?

... 3వ పేజీ తరువాయి

చెల్లించమని, ఈ విషయంలో మరోసారి తన వద్దకు రావద్దని స్పష్టంచేసినా.. జల వనరులశాఖ అధికారులు మాత్రం ఇప్పటికీ నగర అవసరాలకు తగినంత నీటిని సరఫరా చేస్తూనే ఉన్నారు.

బకాయిల వివరాలివి...

జీవీఎంసీ ఇప్పటివరకు మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌కురూ.49.93 కోట్లు, రైవాడకు రూ.156 కోట్లు, గంభీరం రిజర్వాయర్‌కు రూ.4.36 కోట్లు, తాటిపూడికి రూ.0.94 కోట్లు చెల్లించాల్సి ఉంది. సిబ్బంది కొరతతో రిజర్వాయర్ల నిర్వహణ కష్టంగా మారిందని, బకాయిలు చెల్లించకపోవడంతో రైవాడ ప్రాజెక్టుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు వాపోతున్నారు. ప్రతి ప్రాజెక్టుకు ఏటా కనీసం రూ.25 లక్షలు చెల్లిస్తే నిర్వహణలో ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు.

పూడిక తొలగింపులోనూ మీనమేషాలు

ఇదిలావుండగా ప్రాజెక్టులు నిర్మించి నాలుగు దశాబ్దాలు గడిచినందున రిజర్వాయర్లలో పూడిక పెరుగుతోంది. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో 37 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తీయడానికి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ రూ.240 కోట్లకు ప్రతిపాదించి పదేళ్లు గడచింది. రైవాడ, తాటిపూడిలో కూడా పూడిక పెరుగుతుండంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోందని జలవనరులశాఖ రిటైర్డు ఇంజనీరు ఒకరు తెలిపారు. నగర జనాభా పెరిగే క్రమంలో నీటి అవసరాలకు తగినట్టుగా ప్రాజెక్టుల నిర్వహణకు జీవీఎంసీ నిధులు ఇవ్వకపోతే విశాఖపట్నం మరో బెంగళూరు మాదిరిగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటుందని ఆయన హెచ్చరిస్తున్నారు.

లాడ్జిల నిర్వహణ ఇష్టారాజ్యం

... 3వ పేజీ తరువాయి

వెళ్లిపోతామని చెప్పి గదులను అడిగినా కాదనకుండా ఇచ్చేస్తున్నారు. కొంత మంది ప్రేమికులు వచ్చి ఒకటి, రెండు గంటలు గది కావాలని కోరినా అభ్యంతరం చెప్పడం లేదు. రోజంతటికీ అద్దె కడుతున్నాసరే ముందుగానే ఖాళీ చేసేస్తుండడంతో నిర్వాహకులు గదులు ఇవ్వడానికి మొగ్గుచూపుతున్నారు. దీంతో కొన్నిహోటళ్లు, లాడ్జిలు పేకాట, వ్యభిచారం, గంజాయి స్మగ్లర్లకు అడ్డాగా మారిపోయాయి.

స్పందించిన సీపీ

ఈ వ్యవహారాలు సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టికి వెళ్లడంతో ఈనెల 16న నగరవ్యాప్తంగా ఏకకాలంలో లాడ్జిలు, హోటళ్లలో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. 400 మంది సిబ్బందిని 80 ప్రత్యేక బృందాలుగా ఏర్పాటుచేసి ఉదయం ఆరున్నర గంటల నుంచి ఐదు గంటలపాటు 121 లాడ్జిల్లో తనిఖీలు చేయించారు. ఈ సందర్భంగా నాలుగు లాడ్జిల్లో వేర్వేరుగా గంజాయితో ఉన్న నలుగురిపై కేసులు నమోదుచేశారు. మద్యం సీసాలను అధికమొత్తంలో కలిగివున్న ఒకరిని గుర్తించారు. శివాజీపాలెంలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు చెందిన లాడ్జిలో వ్యభిచారం సాగిస్తున్న ముగ్గురు మహిళలతోపాటు నిర్వాహకుడు, విటుడిని అరెస్టు చేశారు. కొన్ని హోటళ్లలో బసచేసేవారిలో మైనర్లు ఉండడం, మరికొన్ని లాడ్జిలకు అనుమతులు లేవని గుర్తించడంతో నిర్వహణలో లొసుగులు బయటపడ్డాయి.

నిబంధనలు బేఖాతర్

నగరంలోని కొన్ని లాడ్జిలు, హోటళ్ల నిర్వహకులు డబ్బులిస్తే చాలు ఎవరికైనా గదులు కేటాయించేస్తున్నారు. వారి నుంచి వ్యక్తిగత గుర్తింపు కార్డులు కూడా తీసుకోవడం లేదు. నిబంధనల ప్రకారం లాడ్జి/హోటల్‌లో దిగే వారి వ్యక్తిగత గుర్తింపుకార్డు జెరాక్స్‌ను నిర్వాహకులు తీసుకోవాలి.ఎంతమంది, ఎక్కడి నుంచి, ఏ పని మీద వచ్చారనే వివరాలతోపాటు ఫోన్‌నంబరు రికార్డులో నమోదుచేసి, విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇతర రాష్ట్రాలకు చెందినవారు గదుల్లో దిగితే వారి వివరాలను వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. హోటళ్లు/లాడ్జిల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆరా తీయాలి. అతిథులు దిగే గదుల్లోకి ఎక్కువమంది వెళ్లి వస్తుంటే పోలీసులకు తెలియపరచాలి. హోటల్/లాడ్జిల్లో ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే తక్షణం ఆర్పేందుకు భద్రతాచర్యలు చేపట్టాలి. రిసెప్షన్ వద్దనే పోలీసులు, అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన నంబర్లను ప్రదర్శించాలి. కానీ నగరంలోని 90 శాతం హోటళ్లలో ఈ నిబంధనలను పాటిస్తున్న దాఖలాల్లేవు. ప్రతినెల పరిశీలనకు రికార్డులను సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు పంపడం లేదు. పోలీసులు, నిర్వాహకులు మిలాఖత్ అయి నిబంధనలు గాలికి వదిలేస్తున్నారనేఆరోపణలున్నాయి.లాడ్జిలు/హోటళ్లలో లోపాలపైసీపీ లోతుగా దృష్టి సారిస్తే మరిన్ని లొసుగులు బయటపడతాయని పోలీసు సిబ్బందే చెబుతున్నారు.

జ్వరం, దద్దుర్లు

... 3వ పేజీ తరువాయి

ఇబ్బందులు ఎదుర్కొంటారు. తీవ్రమైన మంట వేధిస్తుంది. వారం నుంచి పది రోజులపాటు ఇబ్బంది పడుతుంటారు. కొన్నిసార్లు మూడువారాల వరకు వేధిస్తుంటాయి. ఈ వైరస్ కూడా వేగంగా వ్యాపించే గుణాన్ని కలిగి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ఆందోళన వద్దు..

ఎగ్జాంతమా, హెచ్ఎంఎఫ్ డిసీజ్‌లో ఎర్రని పొక్కులు, బొబ్బలు వస్తుంటాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో వ్యాప్తి చెందుతున్న మంకీ ఫాక్స్ లక్షణాలు కూడా ఇదేవిధంగా ఉండడంతో చాలా మంది తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ తరహా లక్షణాలున్న వెంటనే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

పెందుర్తి-అరకు రోడ్డుకు మహర్దశ

... 3వ పేజీ తరువాయి

సంస్థ, రెవెన్యూ సర్వే సిబ్బంది మార్కింగ్ రాళ్లను వేశారు. తమ భూములు, ఆస్తులపై సర్వే చేస్తున్నారనే సమాచారంతో బాధితులు అడ్డుకున్నారు. ప్రాథమిక సర్వే అని సిబ్బంది తెలిపినా వినిపించుకోలేదు. దీంతో పాటు రోడ్డు మధ్య నుంచి కుడివైపున 90 అడుగులు, ఎడమవైపు 40 అడుగులు విస్తరణ చేపట్టడం దారుణమన్నారు. దీనిపై కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతం నిధుల కేటాయింపు జరగడంతో పనుల్లో కదలిక వస్తుందని భావిస్తున్నారు. నిర్మాణ పనులపై అభ్యంతరాలు స్వీకరించి, అనంతరం గెజిట్ నోటిఫికేషన్ ఇస్తారని సమాచారం.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఎగ్జిబిషన్‌లో విద్యార్థులతో అతిథులు

సీతమ్మధార, ఆగస్టు 18: సీతమ్మధారలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఆదివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఫొటో గ్రాఫర్, లెన్స్ మ్యాస్ట్రో గ్రూప్ వ్యవస్థాపక డైరెక్టర్ గురుదాస్ దువా, అగర్వాల్ ఇమేజ్ ప్రతినిధి బీకే ఆగర్వాల, 35 ఎంఎం ఆర్ట్స్ వ్యవస్థాపకులు ఆర్ నరేంద్ర ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. విద్యార్థులకు ఫొటోగ్రఫీలో మెలకువలను, నైపుణ్యాలను వివరించారు. విద్యార్థులు 1500 ఫొటోలను ప్రదర్శించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రకటించారు. స్కూల్ డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాష్ విద్యార్థులను అభినందించారు.

ఫొటో, వీడియోగ్రాఫ్‌లపై ఉచిత శిక్షణ

మహారాణిపేట: ఫొటో, వీడియోగ్రఫీలపై పేద యువతీ, యువకులకు ఉచితంగా శిక్షణ అందించనున్నట్టు ప్రముఖ ఫొటోగ్రాఫర్ శ్రీమతి అంజలి తెలిపారు. ఆదివారం మహారాణిపేటలో ఓ సమావేశమందిరంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతీ యువకుల ఆర్థిక స్వావలంబనకు ఉచితంగా ఫొటో, వీడియోగ్రాఫ్, ఆల్బమ్ డిజైనింగ్, ఎడిటింగ్ తదితర అంశలపై ఉచితంగా శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ సహకారంతో శిక్షణ కేంద్రం ఏర్పాటుచేస్తామన్నారు. ఈ సమావేశంలో పలువురు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

నేడు గాయకులకు బిరుదులు ప్రదానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, ఆగస్టు 18: సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరగనున్న స్వరాంజలి, స్వర కోకిల బిరుదుల ప్రదానోత్సవ కార్యక్రమం సంబంధించిన పోస్టర్‌ని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆదివారం ఆవిష్కరించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు గాయని గారపాటి జ్యోతికి స్వర కోకిల బిరుదుతో సత్కరిస్తున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బొమ్మిడి సత్యనారాయణ, పి.శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మహారాణిపేట, ఆగస్టు 18: జెట్ వేర్కు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ కూడలిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరానికి స్పందన లభించింది. సుమారు 70 మంది సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది సలీమ్, నరేంద్ర, ప్రకాశరావు, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న సభ్యులు

ఖాతాదారుల ప్రయోజనమే లక్ష్యం

- యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ షాలినీ మీనన్



సమావేశంలో యూనియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు, అతిథులు

సీతమ్మధార, ఆగస్టు 18: సీతమ్మధారలోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జోనల్ మేనేజర్ షాలినీ మీనన్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారుల ప్రయోజనమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామన్నారు. విశ్రాంత ఉద్యోగులు బ్యాంక్ పురోభివృద్ధికి సహాయ సహకారాలు అందివ్వాలని కోరారు. బ్యాంక్ డీజీఎం అండ్ రీజనల్ అధికారి ఆర్. నరసింహకుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తమ బ్యాంక్‌లో డిపాజిట్లపై సీనియర్ సిటిజన్స్‌కి 333 రోజులకి 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్స్‌కి 8.15 శాతం అత్యధిక వడ్డీని పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులకు జ్ఞాపికలను అందచేశారు. విశ్రాంత ఉన్నతాధికారులు ఏవీ రామకృష్ణారావు, జి.వాసుదేవమూర్తి, ఎంఎస్ భాస్కరరావు, టి. కామేశ్వరరావు బ్యాంక్ పురోభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు హెచ్.శంకర్, బీజీఆర్ నాయుడు, కేవీఎల్ రమేష్, బి.గోవిందరాజులు, విశ్రాంత ఉద్యోగులు టి.కృష్ణారావు, ఆర్‌వీ రవికుమార్, కె. రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

మహారాణిపేట, ఆగస్టు 18: ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. వివరాలివి.. వన్‌టౌన్‌లోని కందుల వారివీధిలో నేపాక వరలక్ష్మి, ఉదయ్‌కుమార్ దంపతులు నివసిస్తున్నారు. ఉదయ్‌కుమార్ నిత్యం మద్యంతాగి వచ్చి వేధిస్తున్నట్టు ఆదివారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో వరలక్ష్మి ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. అంతలో ఉదయ్‌కుమార్ స్టేషన్‌కు వచ్చి భార్యను తనతో ఇంటికి రావాలని కోరాడు. ఆమె నిరాకరించింది. దీం తో మనస్తాపం చెందిన ఉదయ్‌కుమార్ ఒక్కరే ఇంటికి వెళ్లిన త ర్వాత తాను ఆత్మహత్య చేసుకోనున్నట్టు తన సోదరి భవానికి ఫోన్‌లో తెలిపారు. ఆమెవెంటనే వన్‌టౌన్ పోలీసు స్టేషన్ సమాచారమివ్వడంతో అప్రమత్తమైన బ్లూకోట్ పోలీసు జి. రామకృష్ణారెడ్డిని వెంటనే ఉదయ్‌కుమార్ ఇంటికి పంపించారు. అప్పటికే ఫ్యాన్ ఉరివేసుకుంటున్నఉదయ్‌కుమార్‌ను కాపాడి స్టేషన్‌కు తీసుకు వ చ్చారు. సీఐ భాస్కర నాయుడు అతనికి కౌన్సెలింగ్‌చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, ఆగస్టు 18: కంచరపాలెంలో గల ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 20వ తేదీ మంగళవారం పాలిటెక్నిక్ డిప్లొమా హోల్డర్స్‌కు మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నటు ప్రిన్సిపాల్ డా. కె.వి.రమణ పే ర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో గ్లోబల్ సంస్థ ఆటోలివ్ డిప్లొమా ట్రైనీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటోమొబైల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ లేదా ఎలక్ట్రానిక్ విభాగాల్లో 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపికైన అభ్యర్థుల వార్షికవేతనం రూ.2.36 లక్షలు చెల్లించనున్నారు. చెన్నైలోని కాంచీపురంలో ఉద్యోగం చేయడానికి సిద్ధపడాలి.

నిరాశ్రయుడికి ఆశ్రయం



వసతి గృహంలో చేరిన రాము

అక్కయ్యపాలెం, ఆగస్టు 18: కాలికి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న చొప్పల రాము (55) అనే వ్యక్తిని టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆయనది స్వస్థలం శ్రీకాకుళమని, రోజు వారి విజిట్‌లో మాట్లాడామని, ఆరోగ్యం బాగోలేకపోవడంతో పని మానేసినట్టు తెలిపినట్టు చెప్పారు. భార్య, పిల్లలున్నా ఒంటరిగా ఉన్నట్టు చెప్పారు.

ముగిసిన ఐటీఐ ప్రాక్టికల్స్



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం, ఆగస్టు 18 : స్థానిక ప్రభుత్వ పాత ఐటీఐ, బాలికల ఐటీఐ, నరవ ప్రభుత్వ ఐటీఐల్లో విద్యార్థులకు ప్రాక్టికల్స్ శనివారంతో ముగిశాయి. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ మొదటి, ద్వితీయ సంవత్సరం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఫిట్టర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, వెల్డర్,ఆర్ &ఏసీ తదితర ట్రేడుల్లో ప్రాక్టికల్స్ కొనసాగాయి. ఈ విద్యార్థులకు త్వరలో ఆన్‌లైన్‌లో మెయిన్ పరీక్షలు ప్రారంభంకానున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ జె. శ్రీకాంత్ పేర్కొన్నారు.

ఖాదర్‌బాబాకు డాక్టరేట్ ప్రదానం

సీతంపేట, ఆగస్టు 18: పేదలకు సేవలందిం చడంతోపాటు వీఆర్‌వోగా ఉత్తమ అవార్డు అందుకున్న చిన్నవాల్తేర్‌కి చెందిన ఖాదర్‌బాబాకి సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ పురస్కారం ప్రదానం చేసింది. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ చిన్నారావు అధ్యక్షతన జరిగిన ఈసభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణలనుంచి ఖాదర్‌బాబా డాక్టరేట్ అందుకున్నారు

'వైద్య విద్యార్థిని హత్య పాశవిక చర్య'

రామ్‌నగర్, ఆగస్టు 18: కోల్‌కత్తా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ఆంధ్ర వైద్య కళాశాల వైద్యులు ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉదయం బీచ్‌రోడ్డులో పలు వైద్యసంఘాల ప్రతినిధులు, వైద్యులు బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసీయూ వరకు ముఖానికి నల్ల మాస్కులు ధరించి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరం లోని పలు ఆసుపత్రులకు చెందిన వైద్యులు, వైద్యసిబ్బంది ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. వెంటనే వైద్య విద్యార్థినిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమానికి ఆంధ్ర వైద్య కళాశాల వైద్యులతోపాటు ప్రభుత్వ ప్రైవేట్ వైద్యులతో పాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్స్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్లమద్దతు తెలిపారు. వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.



నిరసన నిర్వహిస్తున్న హోమియో వైద్యులు

పోరాటానికి మద్దతివ్వాలి: జూనియర్ డాక్టర్లు

మహారాణిపేట: వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనపై జూనియర్ వైద్యులు కొన్నిరోజులుగా విధులను బహిష్కరిస్తున్నారు. దీంతో కేజీహెచ్‌లో రోగులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తాము ఎందుకు విధులకు దూరంగా ఉంటున్నామో ఆస్పత్రికి వచ్చే రోగులు, రోగి సహాయకులకు వివరిస్తూ వారి మద్దతుకోరుతున్నారు. కోల్‌కత్తాలో ఆర్‌జి కర్ వైద్య కళాశాలలో వైద్య సేవలందించిన వైద్య విద్యార్థినిని పాశవికంగా అత్యాచారం చేసి హత్యకు పాల్పడినట్టు వివరిస్తున్నారు. వైద్యులకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమకు మద్దతుగా నిలవాలని వారిలో అవగాహన కల్పించారు. అలాగే, ఈసందర్భంగా సీఎంఆర్ సెంట్రల్‌లో ఫ్లాస్‌మాబ్ నిర్వహించిఅక్కడ వారికి జరిగిన కోల్‌కత్తాలో జరిగిన ఘటనపై వివరించారు. ఈ స్థితిలో తమ పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు


అమ్మవారి పూజల్లో పాల్గొన్న గణబాబు, తదితరులు

పోలమాంబ ఉత్సవాలు ప్రారంభం

మల్కాపురం, ఆగస్టు 18: ఇక్కడి ఎస్సీ కాలనీలో పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సాయంత్రం మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, తదితరులు విచ్చేసి పోలమాంబకు పూజలు జరిపారు. ఉదయం ఏడు గంటలకు మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ ఎదురుగా ఉన్న పోర్టు స్థలంలో అ మ్మవారి పుట్టకు పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం పుట్ట నుంచి మట్టిని ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారి సదరం పట్టు వద్ద ఉంచి పూజలు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా సోమ, మంగళవారాల్లోనూ పోలమాంబకు పూజలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

సామాజిక భవనం నిర్మించాలని వినతి

జీవీఎంసీ 61, 62 వార్డుల పరిధిలో గల పోలమాంబ ఆలయం ఎదురుగా ఉన్న పోర్టు ఖాళీ స్థలంలో ఆలయ అవసరార్థం సామాజిక భవనం నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గణబాబుకు రామ్-రాంజీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. దీనిపై పోర్టు అధికారులతో మాట్లాడతానని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా నూకాంబిక వార్షికోత్సవం

పెదగంట్యాడ, ఆగస్టు 18: జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్‌లోని నూకాంబిక అమ్మవారి వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ చేశాక పంచామృతాభిషేకాలు, అన్నాభిషేకం జరిపారు. కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. సత్యలక్ష్మి మడ్-చెమ్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ డాక్టర్ కేవీ విశ్వనాథ్ దంపతులు అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా ప్రత్యేకంగా అలంకరించగా పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు బి.వెంకటస్వామిరెడ్డి, జి.కాశీవిశ్వేశ్వరరావు, ఎంఎం ఆచారి, కామేశ్వరరావు, అప్పారావు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

పెదగంట్యాడ, ఆగస్టు 18: సమతానగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షునిగా బి.హింతరరావు, ఉపాధ్యక్షునిగా వై.మన్మథరావు, కోశాధికారిగా మహ్మద్ ఖాజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాలనీలోని షిర్డీ సాయి శాంతిధామం ఆలయ చైర్మన్‌గా కొల్లి సత్యంబాబు, వైస్ చైర్మన్‌గా బి.రవిశేఖర్ ఎన్నికయ్యారు.

కూర్మన్నపాలెంలో జంధ్యాలు పంపిణీ

కూర్మన్నపాలెం, ఆగస్టు 18: కూర్మన్నపాలెం శిష్టకరణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కూర్మన్నపాలెంలో జంధ్యాల పౌర్ణమిని పురస్కరించుకుని పలువురికి జంధ్యాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన దక్షిణ భారత హిందీ ప్రచార సభ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస పట్నాయిక్ మాట్లాడుతూ మన ఆచారాలు, సనాతన ధర్మాలు, సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించడానికి కృషి చేస్తున్న సంఘ సభ్యులను అభినందించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేఖరమంత్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ శిష్టకరణాలను ఓబీసీలోకి మార్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గంగవరం గోపి, డి.సత్యారావు, బి.బుచ్చిబాబు, రామచంద్రరావు, బాబు, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

'బంగ్లాదేశ్‌లో హిందువులను రక్షించాలి'

గాజువాక, ఆగస్టు 18: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ తెలుగు యువత 70వ వార్డు అధ్యక్షుడు తుంపాల రమేశ్ రెండు రోజులుగా గాజువాక కూడలిలో ప్లకార్డును ప్రదర్శిస్తున్నారు. బంగ్లాదేశ్‌లోని హిందువులను కాపాడాలని కోరారు. రోజుకు రెండు గంటల చొప్పున ప్లకార్డును ప్రదర్శిస్తున్న రమేశ్‌ను పలువురు యువకులు అభినందించారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 26, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 20, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళదుంపలు 37, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 130, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 38, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 195, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 38, కీరదోస 30, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 58, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 98
ఫారం ధర	-- 118
విత్ స్కిన్	-- 206
స్కిన్‌లెస్	-- 216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 6లో..


జాతీయ రహదారి పక్కన పార్కింగ్ చేసిన లారీలు

ఇసుక డిపో వద్ద పార్కింగ్ సమస్య

జాతీయ రహదారిపై ఇష్టానుసారంగా లారీలు నిలిపివేత

ట్రాఫిక్ ఇబ్బందులకు గురవుతున్న ఇతర వాహనదారులు



అగనంపూడి, ఆగస్టు 18: జాతీయ రహదారి అగనంపూడి సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డిపో వద్ద అనధికార పార్కింగ్‌తో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా గల బ్రిడ్జి నుంచి లంకెలపాలెం వెళ్లేంత వరకు ప్రధాన రహదారిని ఆనుకుని ఒక దాని వెనుక మరొక లారీని ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుకను ఉచితం చేయడంతో పాటు రవాణా చార్జీలను తగ్గించడంతో ఇసుకకు భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో ఇసుక కోసం వినియోగదారుల తాకిడి పెరిగింది. ఈ క్రమంలో ఇక్కడ లారీ యజమానులు సీరియల్ పేరుతో జాతీయ రహదారిపై తమకు నచ్చిన విధంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అయితే జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఈ ప్రాంతానికి వచ్చేసరికి వాహనాల పార్కింగ్ కారణంగా ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక డిపో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో జాతీయ రహదారిపై ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నా పోలీసులు ఎవరికి వారు తమ పరిధి కాదనుకుంటూ పట్టించుకోవడం లేదు. ఈ కారణంగా నిత్యం ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు చోటుచేసుకోవడంతో పాటు ఒక్కోసారి ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. అందువల్ల అధికారులు స్పందించి ఇసుక డిపోకు వచ్చే లారీలకు పార్కింగ్ స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని పలువురు వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూస్తాం

-ఆంజనేయులు, ఇసుక డిపో ఇన్‌చార్జి

ఇసుక కోసం వచ్చే లారీలు జాతీయ రహదారిని ఆనుకుని పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం. స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడి ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్ సిబ్బంది ఉండేలా చూస్తాను.

నెల రోజుల్లోగా స్టేషన్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

గాజువాక పోలీసులకు ఆదేశించిన సీపీ శంఖబ్రత బాగ్చి

ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచన


పోలీస్ స్టేషన్ పరిసరాలను తిలకిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

గాజువాక, ఆగస్టు 18: గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్ లోపల, బయట ఆవరణను నెల రోజుల్లోగా పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ ఆవరణ మొదలుకుని అన్ని విభాగాలను నిశితంగా పరిశీలించారు. స్టేషన్ ఆవరణ అంతా పాడైన వాహనాలతో నిండివుండడం, బాత్‌రూమ్‌లు అపరిశుభ్రంగా ఉండడం, గదులు కూడా అధ్వానంగా ఉండడం పట్ల సీపీ అసహనం వ్యక్తం చేశారు. క్రైమ్ విభాగం మినహా మిగతా అన్ని విభాగాలు అధ్వానంగా ఉన్నాయని పేర్కొన్నారు. బాత్‌రూమ్‌లతో పాటు గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారాన్ని డస్ట్ బిన్లలో వేయాలని, పరిసరాలు శుభ్రంగా ఉంటేనే చక్కగా విధులు నిర్వహించగలరని సిబ్బందికి సూచించారు. అనంతరం స్టేషన్‌లో నమోదైన కేసులు, పారిశ్రామిక ప్రాంతంలో శాంతి భద్రతల గురించి సీఐ శ్రీనివాసరావును, నేరాలకు సంబంధించి క్రైమ్ సీఐ శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ సిబ్బందితో మాట్లాడారు. స్టేషన్‌కు వచ్చేవారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

ఫిర్యాదుదారులకు సూచనలు

ఈ సందర్భంగా సీపీ శంఖబ్రత బాగ్చి స్టేషన్‌కు వచ్చిన పలువురి ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ క్రమంలో తుంగ్లాం ప్రాంతానికి చెందిన నేవీ ఉద్యోగి దీపక్ తన బ్యాంక్ అకౌంట్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నగదు డ్రా చేశారని సీపీకి వివరించారు. దీంతో ఆయన తన ఫోన్ ద్వారా సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయించారు. అలాగే ఓ కుటుంబ వివాదం గురించి సీపీ తెలుసుకుని, భార్యాపిల్లలతో మంచిగా నడుచుకోవాలని ఇంటి పెద్దను మందలించారు.


ఐద్వా ఆధ్వర్యంలో షీలానగర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న ప్రజలు


వైద్య విద్యార్థినికి నివాళులర్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ కాలిబరి సమితి సభ్యులు

వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 18: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో స్థానికులు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతు వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళల సంరక్షణకు చేసిన చట్టాలను సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సనపల జగన్నాథరావు, జి.మణి, ఎ.శ్రీదేవి, మాధురి, తదితరులు పాల్గొన్నారు.


పెందుర్తిలో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినులు, తదితరులు

స్టీల్‌ప్లాంట్ కాళిబరి సమితి ఆధ్వర్యంలో..

ఉక్కుటౌన్‌షిప్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ కాళిబరి సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ వైద్య విద్యార్థినిని దారుణంగా హతమార్చడం దుర్మార్గమని, ఈ దుర్ఘటన సమాజం తలదించుకునేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మృతురాలికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉక్కు జీఎం (ప్రాజెక్ట్) అభయంకర్ బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో..

పెందుర్తి: సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇందిరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు, నర్సింగ్ విద్యార్థినులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో కొవ్వొత్తులతో మానవహారంగా ఏర్పడి వైద్య విద్యార్థినిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నినదించారు. అనంతరం కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్లకార్డులు, కొవ్వొత్తులు పట్టుకుని వైద్యులకు రక్షణ కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు దాడి శ్రీను, సభ్యులు గణేశ్, మంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుకు ఊపిరి పోసిన గనుల లీజు పొడిగింపు ఉత్తర్వులు

పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం, ఆగస్టు 18: ఉక్కు కర్మాగారానికి గనుల లీజును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో ప్లాంటుకు ఊపిరి పోసినట్టయిందని పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1284వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా పెండింగ్ ఉన్న విజయనగరం జిల్లా గర్భాం మాంగనీసు ఖనిజ గనుల లీజును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. ముడిసరకు కొరత వల్ల పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయలేకపోతున్నామని, ఈ సమస్యను కూటమి ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లడంతో ఫలితం దక్కిందన్నారు. మరో చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ బ్లాస్ట్ ఫర్నేస్-1, 2లను మూసివేయడంతో ఉక్కు కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇటీవల స్టీల్‌ప్లాంటుకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కర్మాగారం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ జరగదని హామీ ఇచ్చినా, ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. ప్లాంటును సొంత గనులను సమకూర్చితే లాభాల బాట పడుతుందని పేర్కొన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గర్భాం గనుల లీజు పొడిగింపుతో ప్లాంటుకు పునరుత్తేజం వస్తుందన్నారు. నాయకుడు బొడ్డు పైడిరాజు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నాయకులు కరణం సత్యారావు, ఎస్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, పరంధామయ్య, గోపి, నరేంద్ర, సత్యవతి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండపల్లికి వినతిపత్రం అందజేత

గాజువాక, ఆగస్టు 18: గాజువాక ఆటోనగర్ ఎంఎస్ఎంఈ రాష్ట్ర కార్యాలయ నూతన భవనాన్ని త్వరగా ప్రారంభించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం విజయనగరంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కార్యాలయాన్ని నిర్మించి రెండేళ్లు అవుతుందని, కానీ ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదని వివరించారు. అందువల్ల ఈ భవనం ప్రారంభానికి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, పి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 18: విశాఖ డెయిరీ కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం అధిక ప్రాధాన్యమిస్తోందని డెయిరీ ఎండీ ఎస్‌వీ రమణ అన్నారు. విశాఖ డెయిరీలో ఆదివారం జరిగిన విశాఖ డెయిరీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ 61వ మహాజన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు పీఎల్ ప్రసాద్ మాట్లాడుతూ సభ్యుల సహకారంతో సొసైటీ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో వివిధ తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన సభ్యుల పిల్లలకు ఎండీ రమణ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాలక వర్గంతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.


పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

లారీ ఓనర్ల సమస్యలపై 'పల్లా'కు వినతి

గాజువాక, ఆగస్టు 18: స్టీల్ సిటీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ ఓనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ అధ్యక్షుడు కేసారపు శ్రీను రమేశ్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. 86వ వార్డు రాజీవ్ నగర్ టోల్‌గేటు రోడ్డులో పలు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు ఉన్నాయని, అయితే అక్కడ తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే రాత్రి పూట వీధి లైట్లు వెలగకపోవడంతో దొంగతనాలు జరుగుతున్నాయని, అందువల్ల అక్కడ హైమాస్ట్ లైట్లు వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ సభ్యులు శ్రీనివాసరావు, కన్నారావు, తాతారావు, గణేశ్, రాజు, మహేశ్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.


కైలాసగిరిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి, తదితరులు

అందాలకు నెలవు విశాఖ

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి

విశాఖపట్నం, ఆగస్టు 18: విశాఖ అందాలను అభివర్ణించలేమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కైలాసగిరితో పాటు అక్కడ ఉన్న తెలుగు మ్యూజియంను సందర్శించారు. కొండపై ఉన్న అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. సెల్ఫీ పాయింట్ ప్రాంతంలో కలియతిరిగి సెల్ఫీ తీసుకున్న ఆయన కైలాసగిరి కొండపై నుంచి నగర అందాలను తిలకించారు. కుటుంబ సభ్యులతో కలిసి కొండపై ఉన్న అద్దాల టాయ్ ట్రైన్‌లో ప్రయాణించారు. అలాగే రోప్ వేలో నుంచి తీరాన్ని చూస్తూ సందడి చేశారు.

తెలుగు మ్యూజియంను సందర్శించి అక్కడి విశిష్టతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మ్యూజియంలో కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల విశాఖ పర్యటనలో ఎన్నో మధుర స్మృతులను పొందానని గుర్తు చేసుకున్నారు. ప్రకృతి సోయగాలకు, సహజ సిద్ధమైన అందాలకు విశాఖ కేరాఫ్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయనతో పాటు వీఎం ఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్, విశాఖ రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గోపాలపట్నం, ఆగస్టు 18: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని పూర్వ విద్యార్థులు స్పష్టం చేశారు. పాఠశాలలో ఇటీవల ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘంతో సమన్వయమై పాఠశాలలోని సమస్యల పరిష్కారానికి, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.32 లక్షల ఆర్థిక సాయం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 18: ఆటోనగర్‌లో శనివారం మృతి చెందిన ఓ కార్మికుడి కుటుంబానికి రూ.32 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దేవాడ ప్రాంతానికి చెందిన వజీర్ అనే కార్మికుడు ఆటోనగర్‌లో విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నెహ్రూ పార్కులో జరిగిన సమావేశంలో యాజమాన్యం రూ.15 లక్షలు, సబ్ కాంట్రాక్టర్ రూ.రెండు లక్షలు, వర్క్‌మెన్ ఇన్సూరెన్స్ కింద రూ.15 లక్షలు కలిపి మొత్తం రూ.32 లక్షలు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. ఈ చర్చల్లో కార్మిక నాయకులు మంత్రి రవి, మొహిద్దీన్, బాబా, రాజా, శివ, అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులకు ఆర్‌పీఎఫ్ జరిమానా

గోపాలపట్నం, ఆగస్టు 18: సింహాచలం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో నో పార్కింగ్ జోన్‌లో వాహనాలను నిలుపుతున్న వాహన చోదకులపై ఆర్పీఎఫ్ సిబ్బంది కొరడా ఝుళిపించారు. స్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రదేశంలో వాహనాలు నిలపడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వాహనచోదకులకు పలుమార్లు సిబ్బంది హెచ్చరించినా స్పందన పట్టించుకోకపోవడంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నో పార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలిపిన వారికి జరిమానా విధించినట్టు ఆర్పీఎఫ్ ఎస్ఐ మమత తెలిపారు. ఎవరైనా ప్రయాణికులకు ఇబ్బందులు కలిగేలా నో పార్కింగ్ జోన్‌లో వాహనాలను పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టేషన్‌కు వచ్చే వాహనదారులందరూ తప్పనిసరిగా పార్కింగ్ స్టాండ్‌లోనే తమ వాహనాలను పార్కింగ్ చేయాలని ఆమె సూచించారు.

ఘనంగా మొల్లి ముత్యాలనాయుడు జన్మదిన వేడుకలు


మొల్లి ముత్యాలనాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

గాజువాక, ఆగస్టు 18: గ్రేటర్ 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ వార్డు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు గొలగాని సన్యాసిరావు, ఏదురు నరసింగరావు, ఎం.గంగరాజు, ఆర్.పైడిరాజు, త్రినాథ్, వియ్యపు రాజు, ఎం.ప్రసాద్, తదితరులు ముత్యాలనాయుడుకి శుభాకాంక్షలు తెలిపారు.

సివిల్ సప్లై చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం

పెదగంట్యాడ, ఆగస్టు 18: సివిల్ సప్లై గాజువాక సర్కిల్-3లో సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బీవీ పద్మను ఆదివారం ఉక్కు నిర్వాసిత నాయకులు ఘనంగా సత్కరించారు. ఉత్తమ సేవలకు గాను స్వాతంత్ర్య దినోత్సవం నాడు మంత్రి అనగాని సత్యప్రసాద్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న సందర్భంగా ఆమెను సివిల్ సప్లై గాజువాక కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పులి వెంకటరమణారెడ్డి, బలిరెడ్డి సత్యనారాయణ, ఎం.పెంటయ్య, డి.అప్పారావు, ఎస్.అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

110 మందికి కంటి అద్దాలు పంపిణీ

పెందుర్తి, ఆగస్టు 18: ఉత్తరాంధ్ర శబరిమలై అయ్యప్ప సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఆదివారం ట్రస్టు ఆధ్వర్యంలో కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అయ్యప్ప సేవా ట్రస్ట్ సమకూర్చిన కళ్లజోడును మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ 110 మంది నేత్రరోగులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వేగి పరమేశ్వరరావు .శరగడం బుజ్జి, గురుస్వామి రామస్వామి, శరగడం శంకరరావు, పాల్గొన్నారు.

అప్పన్నపాలెంలో ఉచిత వైద్య శిబిరం

వేపగుంట, ఆగస్టు 18: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో సింహగిరి వాకర్స్ క్లబ్ అసోసియేషన్, ఎస్ఆర్ ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని క్లబ్ డిస్ట్రిక్ట్101 గవర్నర్ కె.ద్వారకానాథ్ ప్రారంభించి మాట్లాడారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సత్యానంద్, క్రాంతికుమార్, రమణమ్మ, క్లబ్ ప్రతినిధులు వి.నారాయణరావు, ఐ.వి.శివరావు, శేషారావు, నాగార్జున, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముత్యమాంబ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బాలుడి మృతదేహానికి అంత్యక్రియలు

వేపగుంట, ఆగస్టు 18: వేపగుంట కూడలిలో బీఆర్‌టీఎస్ సెంటర్ రోడ్డులో విద్యుత్ స్తంభం వైర్లు తగిలి బిచ్చగాడి దంపతుల కుమారుడైన బలరామ్ (7) మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా ఈ బాలుని మృతదేహానికి ముత్యమాంబ సేవా ట్రస్ట్ సభ్యులు అంత్యక్రియలు చేశారు. విద్యుదాఘాతంతో మృతి చెందిన బాలుడికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం చేశాక ఆదివారం అప్పగించారు. దీంతో సేవా ట్రస్టు సభ్యులు ఆ బాలుని మృతదేహాన్ని వేపగుంట శ్మశానవాటికకు తీసుకువచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా సేవా ట్రస్టు సభ్యులను గ్రామ పెద్దలు, కాలనీవాసులు అభినందించారు.

కనకమహాలక్ష్మి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



పూజల్లో కుటుంబ సమేతంగా హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి

జగదాంబ కూడలి, ఆగస్టు 18: శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. న్యాయమూర్తికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. సహాయ కమిషనర్ వి. రాంబాబు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, న్యాయశాఖ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక జీవనాన్ని అలవరచుకోవాలి'



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 18: ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక జీవనం గడపాలని వక్తలు అన్నారు. ఆదివారం నాట్య పరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రతినిధులు కేపీ లిపిరెడ్డి, వై.బాలగణేష్ ఆధ్వర్యంలో అష్టోత్తర శత సంగీత నృత్యార్చన నిర్వహించారు. నగరంలోని గత 35 ఏళ్లుగా ఆధ్యాత్మిక రంగంలో సేవలందిస్తున్న ఎం.వి.రాజశేఖర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి.సందీప్, బి.వి. సూర్యరం, కె.సత్యనారాయణ, వెంకటరమణాచార్యులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ సేవా కార్యక్రమాలపై సెమినార్




సెమినార్ ప్రారంభిస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట, ఆగస్టు 18: జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విశాఖ జోన్ అధ్యక్షుడు గొంపా సురేష్ తెలిపారు. ఆదివారం మహారాణిపేటలోని ఓ హోటల్‌లో జేసీఐ అవార్డు ఓరియంటేషన్ సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ చాప్టర్ పరిధిలో పనిచేస్తున్న పలు సంఘాల ప్రతినిధులను గుర్తించి వారికి అవార్డులను అందించే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో రూపా సిరిపూరి, దిలీప్‌కుమార్, ఎస్. అనురాధ, సోమశేఖర్, రంజిత్ షా, పీటర్ మధన్, ఉమా, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిమితిస్థాయిలోనే గంటల మోత!

» జగదాంబ వద్ద క్లాక్‌టవర్ పనితీరు » జంక్షన్ పరిధిదాటి వినిపించని శబ్దం
» తక్కువ సామర్థ్యంగల బ్యాటరీ, మిషనరీతో సమస్య.. నాణ్యతపై అనుమానాలు



జగదాంబ జంక్షన్‌లో క్లాక్ టవర్

జగదాంబ కూడలి, ఆగస్టు 18: జగదాంబ జంక్షన్‌లో ఎంతో అట్టహాసంగా జీవీఎంసీ ఏర్పాటు చేసిన క్లాక్ టవర్ నిర్మాణంలో నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. ఈ టవర్ నుంచి గంటల శబ్దం ఆ జంక్షన్ వరకే పరిమితం కావడంతో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ శబ్దం వన్‌టౌన్ వరకు మారుమ్రోగుతుందని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ క్లాక్ టవర్ తొలుత ఒప్పందానికి అనుగుణంగా నిర్మాణం సాగలేదని ఆరోపణలు వస్తున్నాయి.టవర్‌లోని మిషనరీ, బ్యాటరీ సామర్థ్యం, గంటల శబ్దంనకు చెందిన సాంకేతికస్థాయి తగ్గించి ఏర్పాటు చేయడంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్టు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. దాదాపు రూ. 2 కోట్లతో క్లాక్ టవర్‌కు వెచ్చించినట్టు తెలిసింది. ఈ నిర్మాణ బాధ్యతలను భువనేశ్వర్‌లోని తాచ్‌వాచ్ అండ్ ఎలక్ట్రానిక్స్ సంస్థ చేపట్టింది. ముంబాయిలోనిఎలక్ట్రానిక్‌సంస్థ నుంచి అవసరమైన యంత్రాలను దిగుమతి చేసుకున్నారు. ముందుగా చేసుకున్న ఒప్పందాన్ని పక్కపెట్టి తక్కువ సామర్థంగల పరికరాలు అమర్చడంతోనే శబ్దంమరీ వినిపించీ వినపించనదిగా వస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేజీహెచ్ సమీపంలోని వాచ్‌మేకర్ జఫురుల్లా ఖాన్ వద్ద ప్రస్తావించగా, తక్కువ సామర్థ్యంగల పరికరాలతోనే గంటల శబ్దం పరిమితిలో ఉంటుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. క్లాక్ టవర్ ప్రమాణాలపై అప్పటి జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మ జోక్యం చేసుకున్నట్టు అనుమానాలు వ్యక్తంమవుతున్నాయి. ఈ లోపాలను సరిచేసి గంటల శబ్దం పెద్దగా వినిపించేలాచూడాలని నగరవాసులు కోరుతున్నారు.

డ్రస్ మేకింగ్, కోపా ట్రేడుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

కంచరపాలెం, ఆగస్టు 18 : కంచరపాలెం బాలికల ఐటీఐల్లో రెండో విడత కౌన్సెలింగ్‌లో మిగులు సీట్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ వరకు గడువు ఉంది. అభ్యర్థులు ఈనెల 27వ తేదీ లోగా సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల్లో అన్నీ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవాలని సూచించారు. వీరికి ఈనెల 29న బాలికల ఐటీఐ ప్రాంగణంలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

నేడు పోలీస్ కమిషనరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో గత రెండు వారాలుగా కార్యక్రమాన్ని నిర్వహించలేదన్నారు. కోడ్ ముగిసినందున ఇకపై ప్రతి సోమవారం యథావిధిగా ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. జీవీఎంసీలో కూడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి ఒంటిగంట మధ్యలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాల్‌కు వచ్చి ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈసందర్భంగా కోరారు.



కళాకారుల కోసం రూపొందించిన ట్రోఫీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

22న ఉత్తరాంధ్ర జానపద జాతర

సీతంపేట, ఆగస్టు 18: ఉత్తరాంధ్ర కళలు, జానపద కళాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఈ నెల 22వ తేదీన జానపద జాతరను నిర్వహిస్తున్నట్టు రైటర్స్ అకాడమీ ఛైర్మన్, ఉత్తరాంధ్ర జానపద జాతర నిర్వాహక కమిటీ డైరెక్టర్ బీవీ రమణమూర్తి తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఈనెల 22న సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఈ జానపద జాతర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో నగరంలోని అన్ని కళా సంస్థలూ భాగస్వామ్యం కానున్నాయన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు బీచ్‌రోడ్డులో విశ్వప్రియ ఫంక్షన్ హాలు నుంచి 40కి పైగా జానపద నృత్యాలు, 3వేల మంది కళాకారులతో ర్యాలీ గురజాడ కళాక్షేత్రం వరకు సాగుతుందన్నారు. సాయంత్రం చిన్న తాళం, భజన, చెక్క భజన, పులివేషాలు, కర్రసాము, కత్తిసాము, తూర్పు బాగోతం, సవర ఆగం, థింసా నృత్యాలు, పొడుగు కాళ్లు, జాలరి నృత్యం, రైతు నృత్యం, జముకు పాట ఇలా ఉత్తరాంధ్ర జానపద కళాకారుల నృత్యాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా సినీ హాస్యనటుడు బ్రహ్మానందంహాజరుకానున్నారన్నారు. సమావేశంలో పలు కళా సంస్థల ప్రతినిధులు,సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించరా?

... 3వ పేజీ తరువాయి

చెల్లించమని, ఈ విషయంలో మరోసారి తన వద్దకు రావద్దని స్పష్టంచేసినా.. జల వనరులశాఖ అధికారులు మాత్రం ఇప్పటికీ నగర అవసరాలకు తగినంత నీటిని సరఫరా చేస్తూనే ఉన్నారు.

బకాయిల వివరాలివి...

జీవీఎంసీ ఇప్పటివరకు మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌కురూ.49.93 కోట్లు, రైవాడకు రూ.156 కోట్లు, గంభీరం రిజర్వాయర్‌కు రూ.4.36 కోట్లు, తాటిపూడికి రూ.0.94 కోట్లు చెల్లించాల్సి ఉంది. సిబ్బంది కొరతతో రిజర్వాయర్ల నిర్వహణ కష్టంగా మారిందని, బకాయిలు చెల్లించకపోవడంతో రైవాడ ప్రాజెక్టుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు వాపోతున్నారు. ప్రతి ప్రాజెక్టుకు ఏటా కనీసం రూ.25 లక్షలు చెల్లిస్తే నిర్వహణలో ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు.

పూడిక తొలగింపులోనూ మీనమేషాలు

ఇదిలావుండగా ప్రాజెక్టులు నిర్మించి నాలుగు దశాబ్దాలు గడిచినందున రిజర్వాయర్లలో పూడిక పెరుగుతోంది. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో 37 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తీయడానికి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ రూ.240 కోట్లకు ప్రతిపాదించి పదేళ్లు గడచింది. రైవాడ, తాటిపూడిలో కూడా పూడిక పెరుగుతుండంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోందని జలవనరులశాఖ రిటైర్డు ఇంజనీరు ఒకరు తెలిపారు. నగర జనాభా పెరిగే క్రమంలో నీటి అవసరాలకు తగినట్టుగా ప్రాజెక్టుల నిర్వహణకు జీవీఎంసీ నిధులు ఇవ్వకపోతే విశాఖపట్నం మరో బెంగళూరు మాదిరిగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటుందని ఆయన హెచ్చరిస్తున్నారు.

లాడ్జిల నిర్వహణ ఇష్టారాజ్యం

... 3వ పేజీ తరువాయి

వెళ్లిపోతామని చెప్పి గదులను అడిగినా కాదనకుండా ఇచ్చేస్తున్నారు. కొంత మంది ప్రేమికులు వచ్చి ఒకటి, రెండు గంటలు గది కావాలని కోరినా అభ్యంతరం చెప్పడం లేదు. రోజంతటికీ అద్దె కడుతున్నాసరే ముందుగానే ఖాళీ చేసేస్తుండడంతో నిర్వాహకులు గదులు ఇవ్వడానికి మొగ్గుచూపుతున్నారు. దీంతో కొన్నిహోటళ్లు, లాడ్జిలు పేకాట, వ్యభిచారం, గంజాయి స్మగ్లర్లకు అడ్డాగా మారిపోయాయి.

స్పందించిన సీపీ

ఈ వ్యవహారాలు సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టికి వెళ్లడంతో ఈనెల 16న నగరవ్యాప్తంగా ఏకకాలంలో లాడ్జిలు, హోటళ్లలో ఆకస్మిక సోదా లు నిర్వహించారు. 400 మంది సిబ్బందిని 80 ప్రత్యేక బృందాలుగా ఏర్పాటుచేసి ఉదయం ఆరున్నర గంటల నుంచి ఐదు గంటలపాటు 121 లాడ్జిల్లో తనిఖీలు చేయించారు. ఈ సందర్భంగా నాలుగు లాడ్జిల్లో వేర్వేరుగా గంజాయితో ఉన్న నలుగురిపై కేసులు నమోదుచేశారు. మద్యం సీసాలను అధికమొత్తంలో కలిగివున్న ఒకరిని గుర్తించారు. శివాజీపాలెంలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు చెందిన లాడ్జిలో వ్యభిచారం సాగిస్తున్న ముగ్గురు మహిళలతోపాటు నిర్వాహకుడు, విటుడిని అరెస్టు చేశారు. కొన్ని హోటళ్లలో పనిచేసేవారిలో మైనర్లు ఉండడం, మరికొన్ని లాడ్జిలకు అనుమతులు లేవని గుర్తించడంతో నిర్వహణలో లొసుగులు బయటపడ్డాయి.

నిబంధనలు బేఖాతర్

నగరంలోని కొన్ని లాడ్జిలు, హోటళ్ల నిర్వహకులు డబ్బులిస్తే చాలు ఎవరికైనా గదులు కేటాయించేస్తున్నారు. వారి నుంచి వ్యక్తిగత గుర్తింపు కార్డులు కూడా తీసుకోవడం లేదు. నిబంధనల ప్రకారం లాడ్జి/హోటల్‌లో దిగే వారి వ్యక్తిగత గుర్తింపుకార్డు జెరాక్స్‌ను నిర్వాహకులు తీసుకోవాలి.ఎంతమంది, ఎక్కడి నుంచి, ఏ పని మీద వచ్చారనే వివరాలతోపాటు ఫోన్‌నంబరు రికార్డులో నమోదుచేసి, విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇతర రాష్ట్రాలకు చెందినవారు గదుల్లో దిగితే వారి వివరాలను వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. హోటళ్లు/లాడ్జిల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆరా తీయాలి. అతిథులు దిగే గదుల్లోకి ఎక్కువమంది వెళ్లి వస్తుంటే పోలీసులకు తెలియపరచాలి. హోటల్/లాడ్జిల్లో ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే తక్షణం ఆర్పేందుకు భద్రతాచర్యలు చేపట్టాలి. రిసెప్షన్ వద్దనే పోలీసులు, అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన నంబర్లను ప్రదర్శించాలి. కానీ నగరంలోని 90 శాతం హోటళ్లలో ఈ నిబంధనలను పాటిస్తున్న దాఖలాల్లేవు. ప్రతినెల పరిశీలనకు రికార్డులను సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు పంపడం లేదు. పోలీసులు, నిర్వాహకులు మిలాఖత్ అయి నిబంధనలు గాలికి వదిలేస్తున్నారనేఆరోపణలున్నాయి.లాడ్జిలు/హోటళ్లలో లోపాలపైసీపీ లోతుగా దృష్టి సారిస్తే మరిన్ని లొసుగులు బయటపడతాయని పోలీసు సిబ్బందే చెబుతున్నారు.

జ్వరం, దద్దుర్లు

... 3వ పేజీ తరువాయి

ఇబ్బందులు ఎదుర్కొంటారు. తీవ్రమైన మంట వేధిస్తుంది. వారం నుంచి పది రోజులపాటు ఇబ్బంది పడుతుంటారు. కొన్నిసార్లు మూడువారాల వరకు వేధిస్తుంటాయి. ఈ వైరస్ కూడా వేగంగా వ్యాపించే గుణాన్ని కలిగి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ఆందోళన వద్దు..

ఎగ్జాంతమా, హెచ్‌ఎంఎఫ్ డిసీజ్‌లో ఎర్రని పొక్కులు, బొబ్బలు వస్తుంటాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో వ్యాప్తి చెందుతున్న మంకీ పాక్స్ లక్షణాలు కూడా ఇదేవిధంగా ఉండడంతో చాలా మంది తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ తరహా లక్షణాలున్న వెంటనే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

పెందుర్తి-అరకు రోడ్డుకు మహర్దశ

... 3వ పేజీ తరువాయి

సంస్థ, రెవెన్యూ సర్వే సిబ్బంది మార్కింగ్ రాళ్లను వేశారు. తమ భూములు, ఆస్తులపై సర్వే చేస్తున్నారనే సమాచారంతో బాధితులు అడ్డుకున్నారు. ప్రాథమిక సర్వే అని సిబ్బంది తెలిపినా వినిపించుకోలేదు. దీంతో పాటు రోడ్డు మధ్య నుంచి కుడివైపున 90 అడుగులు, ఎడమవైపు 40 అడుగులు విస్తరణ చేపట్టడం దారుణమన్నారు. దీనిపై కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతం నిధుల కేటాయింపు జరగడంతో పనుల్లో కదలిక వస్తుందని భావిస్తున్నారు. నిర్మాణ పనులపై అభ్యంతరాలు స్వీకరించి, అనంతరం గెజిట్ నోటిఫికేషన్ ఇస్తారని సమాచారం.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఎగ్జిబిషన్‌లో విద్యార్థులతో అతిథులు

సీతమ్మధార, ఆగస్టు 18: సీతమ్మధారలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఆదివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఫొటో గ్రాఫర్, లెన్స్ మ్యాస్ట్రో గ్రూప్ వ్యవస్థాపక డైరెక్టర్ గురుదాస్ దువా, అగర్వాల్ ఇమేజ్ ప్రతినిధి బీకే ఆగర్వాల, 35 ఎంఎం ఆర్ట్స్ వ్యవస్థాపకులు ఆర్ నరేంద్ర ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. విద్యార్థులకు ఫొటోగ్రఫీలో మెలకువలను, నైపుణ్యాలను వివరించారు. విద్యార్థులు 1500 ఫొటోలను ప్రదర్శించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రకటించారు. స్కూల్ డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాష్ విద్యార్థులను అభినందించారు.

ఫొటో, వీడియోగ్రాఫ్‌లపై ఉచిత శిక్షణ

మహారాణిపేట: ఫొటో, వీడియోగ్రఫీలపై పేద యువతీ, యువకులకు ఉచితంగా శిక్షణ అందించనున్నట్టు ప్రముఖ ఫొటోగ్రాఫర్ శ్రీమతి అంజలి తెలిపారు. ఆదివారం మహారాణిపేటలో ఓ సమావేశమందిరంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతీ యువకుల ఆర్థిక స్వావలంబనకు ఉచితంగా ఫొటో, వీడియోగ్రాఫ్, ఆల్బమ్ డిజైనింగ్, ఎడిటింగ్ తదితర అంశలపై ఉచితంగా శిక్షణ అందించనున్నుట్టు చెప్పారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ సహకారంతో శిక్షణ కేంద్రం ఏర్పాటుచేస్తామన్నారు. ఈ సమావేశంలో పలువురు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

నేడు గాయకులకు బిరుదులు ప్రదానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, ఆగస్టు 18: సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరగనున్న స్వరాంజలి, స్వర కోకిల బిరుదుల ప్రదానోత్సవ కార్యక్రమం సంబంధించిన పోస్టర్‌ని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆదివారం ఆవిష్కరించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు గాయని గారపాటి జ్యోతికి స్వర కోకిల బిరుదుతో సత్కరిస్తున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బొమ్మిడి సత్యనారాయణ, పి.శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న సభ్యులు

మహారాణిపేట, ఆగస్టు 18: జెట్ వేర్కు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ కూడలిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరానికి స్పందన లభించింది. సుమారు 70 మంది సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది సలీమ్, నరేంద్ర, ప్రకాశరావు, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల ప్రయోజనమే లక్ష్యం

» యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ షాలినీ మీనన్



సమావేశంలో యూనియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు, అతిథులు

సీతమ్మధార, ఆగస్టు 18: సీతమ్మధారలోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జోనల్ మేనేజర్ షాలినీ మీనన్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారుల ప్రయోజనమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామన్నారు. విశ్రాంత ఉద్యోగులు బ్యాంక్ పురోభివృద్ధికి సహాయ సహకారాలు అందివ్వాలని కోరారు. బ్యాంక్ డీజీఎం అండ్ రీజనల్ అధికారి ఆర్. నరసింహకుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తమ బ్యాంక్‌లో డిపాజిట్లపై సీనియర్ సిటిజన్స్‌కి 333 రోజులకి 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్స్‌కి 8.15 శాతం అత్యధిక వడ్డీని పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులకు జ్ఞాపికలను అందచేశారు. విశ్రాంత ఉన్నతాధికారులు ఏవీ రామకృష్ణారావు, జి.వాసుదేవ మూర్తి, ఎంఎస్ భాస్కరరావు, టి. కామేశ్వరరావు బ్యాంక్ పురోభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు హెచ్.శంకర్, బీజీఆర్ నాయుడు, కేవీఎల్ రమేష్, బి.గోవిందరాజులు, విశ్రాంత ఉద్యోగులు టి.కృష్ణారావు, ఆర్‌వీ రవికుమార్, కె. రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

మహారాణిపేట, ఆగస్టు 18: ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. వివరాలివి.. వన్‌టౌన్‌లోని కందుల వారివీధిలో నేపాక వరలక్ష్మి, ఉదయ్‌కుమార్ దంపతులు నివసిస్తున్నారు. ఉదయ్‌కుమార్ నిత్యం మద్యంతాగి వచ్చి వేధిస్తున్నట్టు ఆదివారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో వరలక్ష్మి ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. అంతలో ఉదయ్‌కుమార్ స్టేషన్‌కు వచ్చి భార్యను తనతో ఇంటికి రావాలని కోరాడు. ఆమె నిరాకరించింది. దీం తో మనస్తాపం చెందిన ఉదయ్‌కుమార్ ఒక్కరే ఇంటికి వెళ్లిన త ర్వాత తాను ఆత్మహత్య చేసుకోనున్నట్టు తన సోదరి భవానికి ఫోన్‌లో తెలిపారు. ఆమెవెంటనే వన్‌టౌన్ పోలీసు స్టేషన్ సమాచారమివ్వడంతో అప్రమత్తమైన బ్లూకోట్ పోలీసు జి. రామకృష్ణారెడ్డిని వెంటనే ఉదయ్‌కుమార్ ఇంటికి పంపించారు. అప్పటికే ఫ్యాన్ ఉరివేసుకుంటున్నఉదయ్‌కుమార్‌ను కాపాడి స్టేషన్‌కు తీసుకు వచ్చారు. సీఐ భాస్కర నాయుడు అతనికి కౌన్సెలింగ్‌చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, ఆగస్టు 18: కంచరపాలెంలో గల ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 20వ తేదీ మంగళవారం పాలిటెక్నిక్ డిప్లొమా హోల్డర్స్‌కు మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నటు ప్రిన్సిపాల్ డా. కె.వి.రమణ పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో గ్లోబల్ సంస్థ ఆటోలివ్ డిప్లొమా ట్రైనీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటోమొబైల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ లేదా ఎలక్ట్రానిక్ విభాగాల్లో 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపికైన అభ్యర్థుల వార్షికవేతనం రూ.2.36 లక్షలు చెల్లించనున్నారు. చెన్నైలోని కాంచీపురంలో ఉద్యోగం చేయడానికి సిద్ధపడాలి.

'వైద్య విద్యార్థిని హత్య పాశవిక చర్య'



నిరసన నిర్వహిస్తున్న హోమియో వైద్యులు

రామ్‌నగర్, ఆగస్టు 18: కోల్‌కత్తా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ఆంధ్ర వైద్య కళాశాల వైద్యులు ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉదయం బీచ్‌రోడ్డులో పలు వైద్యసంఘాల ప్రతినిధులు, వైద్యులు బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసీయూ వరకు ముఖానికి నల్ల మాస్కులు ధరించి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరం లోని పలు ఆసుపత్రులకు చెందిన వైద్యులు, వైద్యసిబ్బంది ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. వెంటనే వైద్య విద్యార్థినిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమానికి ఆంధ్ర వైద్య కళాశాల వైద్యులతోపాటు ప్రభుత్వ ప్రైవేట్ వైద్యులతో పాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్స్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్లమద్దతు తెలిపారు. వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

పోరాటానికి మద్దతివ్వాలి: జూనియర్ డాక్టర్లు

మహారాణిపేట: వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనపై జూనియర్ వైద్యులు కొన్నిరోజులుగా విధులను బహిష్కరిస్తున్నారు. దీంతో కేజీహెచ్‌లో రోగులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తాము ఎందుకు విధులకు దూరంగా ఉంటున్నామో ఆస్పత్రికి వచ్చే రోగులు, రోగి సహాయకులకు వివరిస్తూ వారి మద్దతుకోరుతున్నారు. కోల్‌కత్తాలో ఆర్‌జి కర్ వైద్య కళాశాలలో వైద్య సేవలందించిన వైద్య విద్యార్థినిని పాశవికంగా అత్యాచారం చేసి హత్యకు పాల్పడినట్టు వివరిస్తున్నారు. వైద్యులకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమకు మద్దతుగా నిలవాలని వారిలో అవగాహన కల్పించారు. అలాగే, ఈసందర్భంగా సీఎంఆర్ సెంట్రల్‌లో ఫ్లాస్‌మాబ్ నిర్వహించిఅక్కడ వారికి జరిగిన కోల్‌కత్తాలో జరిగిన ఘటనపై వివరించారు. ఈ స్థితిలో తమ పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు

నిరాశ్రయుడికి ఆశ్రయం



వసతి గృహంలో చేరిన రాము

అక్కయ్యపాలెం, ఆగస్టు 18: కాలికి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న చొప్పల రాము (55) అనే వ్యక్తిని టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆయనది స్వస్థలం శ్రీకాకుళమని, రోజు వారి విజిట్‌లో మాట్లాడామని, ఆరోగ్యం బాగోలేకపోవడంతో పని మానేసినట్టు తెలిపినట్టు చెప్పారు. భార్య, పిల్లలున్నా ఒంటరిగా ఉన్నట్టు చెప్పారు.

ముగిసిన ఐటీఐ ప్రాక్టికల్స్



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం, ఆగస్టు 18 : స్థానిక ప్రభుత్వ పాత ఐటీఐ, బాలికల ఐటీఐ, నరవ ప్రభుత్వ ఐటీఐల్లో విద్యార్థులకు ప్రాక్టికల్స్ శనివారంతో ముగిశాయి. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ మొదటి, ద్వితీయ సంవత్సరం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఫిట్టర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, వెల్డర్,ఆర్ &ఏసీ తదితర ట్రేడుల్లో ప్రాక్టికల్స్ కొనసాగాయి. ఈ విద్యార్థులకు త్వరలో ఆన్‌లైన్‌లో మెయిన్ పరీక్షలు ప్రారంభంకానున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ జె. శ్రీకాంత్ పేర్కొన్నారు.

ఖాదర్‌బాబాకు డాక్టరేట్ ప్రదానం

సీతంపేట, ఆగస్టు 18: పేదలకు సేవలందిం చడంతోపాటు వీఆర్‌వోగా ఉత్తమ అవార్డు అందుకున్న చిన్నవాల్తేర్‌కి చెందిన ఖాదర్‌బాబాకి సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ పురస్కారం ప్రదానం చేసింది. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ చిన్నారావు అధ్యక్షతన జరిగిన ఈసభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణలనుంచి ఖాదర్‌బాబా డాక్టరేట్ అందుకున్నారు

నేడు కరాళ చందనం సమర్పణ

సింహాచలం, ఆగస్టు 18 : వరాహలక్ష్మీనృసింహస్వామికి శ్రావణ మాస శుక్లపక్ష పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం కరాళ చందనం సమర్పించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈమేరకు ఐదు కిలోల చందనాన్ని ఆలయ నాల్గవ తరగతి కార్మికుడు శుక్ర, శనివారం అరగదీశారు. అరగదీసిన చందనాన్ని ఆలయ పద్మనిధిలో భద్రపరిచారు. అందులో రెండు కిలోల తిరుమణిని ముద్దగా చేసి మిళితం చేస్తారు. ఆ మిశ్రమాన్ని పౌర్ణమి నాటి సుప్రభాత సేవ తరువాత పండితుల వేద పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి సమర్పించనున్నారు.

రుషికొండ బీచ్‌లో దొంగల భయం

సాగర్‌నగర్, ఆగస్టు 18 : రుషికొండ బీచ్‌లో కేటుగాళ్ల సంచారం ఎక్కువైంది. బ్లూఫ్లాగ్ బీచ్‌గా పేరొందిన ఇక్కడికి నిత్యం వేలాది మంది సందర్శకులు వస్తుంటారు. సముద్ర స్నానాలకు దిగే వారు బయట ఉంచుతున్న బ్యాగులు, సెల్‌ఫోన్లను దొంగలు తస్కరిస్తున్నారు. స్నానాలకు దిగే వారిని కేటుగాళ్లు ముందుగా గుర్తిస్తారు. వారు స్నానాల్లో సరదాగా ఉన్నప్పుడు ఇసుక తెన్నెలపై ఉంచిన సెల్‌ఫోన్లు, బ్యాగులు, ఇతర విలువైన వస్తువులను ఎత్తుకుపోతున్నారు.కొంతమంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సాహసిస్తున్నా.. మరికొంతమంది స్టేషన్ల చుట్టూ ఏమి తిరుగుతాంలే అని మిన్నకుండిపోతున్నారు. బీచ్‌కు వచ్చిన వారిలో ఎక్కువ మంది సుదూర ప్రాంతీయులు కావడంతో వారు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. రుషికొండ ప్రాంతం నుంచి కాకుండా బయట నుంచి వస్తున్న వ్యక్తులే చోరీలకు పాల్పడుతున్నట్టు తెలిసింది. ఆరిలోవ క్రైమ్ విభాగం పోలీసులు తీరంలో నిఘా పెట్టి కేటుగాళ్లపై చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

కన్నుల పండువగా సింహాద్రినాథుని నిత్య కల్యాణం

సింహాచలం, ఆగస్టు 18 : వరాహలక్ష్మీనృసింహస్వామికి అర్జిత నిత్య కల్యాణం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అప్పన్న నిత్యాన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, ఆగస్టు 18 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన చెక్క రాజు, ప్రసాద్ రూ. లక్ష, మరో దాత మహంతి వెంకట లక్ష్మీ రూ. లక్ష విరాళంగా సమర్పించారు. దాతలిద్దరూ విరాళాలను చెక్ రూపంలో ఆలయ అధికారులకు ఆదివారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాతల కుటుంబ సభ్యులకు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దత్తు స్వామికి అంబేడ్కర్ అవార్డు

కొమ్మాది, ఆగస్టు 18 : కబర్డీ ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ సుబ్రహ్మణ్యశాస్త్రి (దత్తుస్వామి) కి అరుదైన గౌరవం దక్కింది. నగరానికి చెందిన చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ ట్రస్ట్ అధినేత డాక్టర్ డి. చిన్నారావు దత్తు స్వామి సామాజిక సేవలను గుర్తించి ఆయనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డును అందించారు. ఈమేరకు ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు.

'నిందితులను కఠినంగా శిక్షించాలి'

ఆరిలోవ, ఆగస్టు 18 : కోల్‌కత్తాలోని వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు జె.రవి, టి. శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాత్రి విధులు నిర్వహించిన వైద్య విద్యార్థినిపై దుం డగులు అత్యాచార దురాగతానికి పాల్పడ్డారన్నారు. కేసును సీబీఐకి బదిలీ చేసినా న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని, సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సినిమా గైడ్

- **తంగలాన్ :** శారద, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** కామేశ్వరి, మెలోడీ, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), కన్య, విశేష్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం).
- **కమిటీ కుర్రోళ్ళు:** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా),నరసింహ(గోపాలపట్నం),శ్రీకన్య-1 (గాజువాక), ,అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 26, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 20, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 130, బరబటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 38, దోసకాయ 22, వెల్లుల్లి (పెద్దవి) 195, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 58, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 6 లో..




పందిమెట్ట వద్ద కొండవాల స్థలంలో అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలు

పందిమెట్టలో కొండవాలు స్థలాల ఆక్రమణ

- అనుమతి లేకుండా నిర్మాణాలు
- స్థానిక నాయకుల సహకారం
- పట్టించుకోని అధికారులు

తగరపువలస, ఆగస్టు 18 : స్థానిక జాతీయ రహదారి సమీపంలో బాలాజీనగర్ పందిమెట్ట కొండవాలు ప్రభుత్వ స్థలంలో అనధికార నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న చిన్న గుట్టలో మట్టి తొలగించి కొంతమంది నాయకులు స్థలాన్ని కబ్జా చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. స్థలాన్ని చిన్న చిన్న ప్లాట్లుగా వేసి అమ్మకాలు చేయడంతో పలువురు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రస్తుతం జూట్ క్వార్టర్లలో నివసిస్తున్న పేదలను అక్కడి నుంచి తరలిస్తే వారికి ఇళ్ల స్థలాలుగా ఈ ప్రాంతాన్ని కేటాయించాలని కొంతమంది నాయకులు ప్రతిపాదించారు. కానీ అందుకు విరుద్ధంగా ఎంతో విలువైన ఈ స్థలాన్ని కొంతమంది స్థానిక నాయకులు సహకారంతో ముందుగా కొండ వద్ద మట్టి తొలగించి నిర్మాణాలు చేపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఆక్రమణలు ప్రారంభం కాగా టీడీపీ నాయకులు కూడా ఈ వ్యవహారంపై నోరు మెదపకపోవడంతో అనుమానాలు తలెత్తుతున్నాయి.నిర్మాణాలు చేపడుతున్న వారెవరికీ పట్టాలు కానీ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు గాని లేవు. 1వ వార్డులోకి వచ్చే ఈ ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న పార్కును కూడా కబ్జా చేస్తున్నారు. కొండవాలు 22-1 సర్వే నంబరు పరిధిలో గతంలో కొంతమంది నిరుపేదలకు పట్టాలు ఇచ్చారు. వాటిలో కొంతమంది నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ సర్వే నంబరును ఆనుకుని కొండవాలు స్థలం ఉండడంతో మట్టి తీసి నాయకులు ధారాదత్తం చేయడంతో కొనుగోలు చేసినవారు నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానిక నాయకుల ప్రోద్బలంతోనే ఆక్రమణ నిర్మాణాలు జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి దీనిపై దర్యాప్తు జరపాలని పలువురు కోరుతున్నారు.

అందాలకు నెలవు విశాఖ

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి



తెలుగు మ్యూజియంలో సుప్రీంకోర్టు జడ్జి జేకే మహేశ్వరి, తదితరులు

విశాలాక్షినగర్, ఆగస్టు 18 : విశాఖ అందాలను అభివర్ణించలేమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కైలాసగిరితో పాటు అక్కడ ఉన్న తెలుగు మ్యూజియంను సందర్శించారు. కొండపై ఉన్న అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. సెల్ఫీ పాయింట్ ప్రాంతంలో కలియతిరిగి సెల్ఫీ తీసుకున్న ఆయన కైలాసగిరి కొండపై నుంచి నగర అందాలను తిలకించారు. కుటుంబ సభ్యులతో కలిసి కొండపై ఉన్న అద్దాల టాయ్ ట్రైన్‌లో ప్రయాణించారు. అలాగే రోప్ వేలో నుంచి తీరాన్ని చూస్తూ సందడి చేశారు. తెలుగు మ్యూజియంను సందర్శించి అక్కడి విశిష్టతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మ్యూజియంలో కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల విశాఖ పర్యటనలో ఎన్నో మధుర స్మృతులను పొందానని గుర్తు చేసుకున్నారు. ప్రకృతి సోయగాలకు, సహజ సిద్ధమైన అందాలకు విశాఖ కేరాఫ్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయనతో పాటు వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్, విశాఖ రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్, తదితరులు ఉన్నారు.

డిసెంబరులో హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలు



సమావేశంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు

భీమునిపట్నం, ఆగస్టు 18 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు డిసెంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించాలని ఆ పాఠశాల ఉత్సవ నిర్వహణ కమిటీ నిర్ణయించింది. ఆదివారం వారు చిన్నబజారులో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో చర్చిస్తామన్నారు. ఆయన సూచనలు, సలహాలతో ముందుకు సాగుతామని తెలిపారు. ఉత్సవ పైలాన్, సరస్వతీదేవి విగ్రహాలను పాఠశాల ఆవరణలో ప్రతిష్ఠిస్తామని చెప్పారు. ఉత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖా మంత్రి లోకేశ్‌ను ఆహ్వానించాలని సమావేశంలో తీర్మానించారు. అలాగే ఉత్సవ్ లోగోలతో టీ షర్టులు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి పైలపల్లి లక్ష్మణరావు, కమిటీ నాయకులు పైలపల్లి షణ్ముఖరావు, ఎంవీ పార్వతీశం, పూసర్ల శ్రీనివాసరావు, కె. ముత్యాలరావు, కాళ్ల సన్నీ, అత్తిలి సత్యనారాయణ, దారపు అప్పారావు, మీసాల మహేశ్వరరావు, మారోజు గోపి, బొండా బాలాజీ, చౌదరి సత్యరాజు, సన్నిబాబు, గణబాబు, నరసింగరావు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై ప్రత్యేక పాలసీలు అవసరం

విశాఖ ఎంపీ శ్రీభరత్



ఎంవీపీ కాలనీ, ఆగస్టు 18 : మహిళల భద్రతపై ప్రత్యేక పాలసీలు అవసరమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలిపై జరిగిన సంఘటన తన హృదయాన్ని కలచి వేసిందని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డాక్టర్ రాదా గోబిందాకర్ బెంగాల్‌లో పేదలకు ఆరోగ్య సంరక్షణ అందించాలన్న లక్ష్యంతో స్థాపించిన ఆర్.జీ.కర్ మెడికల్ కళాశాలలో ఇలాంటి ఘోర సంఘటన చోటుచేసుకోవడం చాలా బాధాకరమని, ఇలాంటి సంఘటనలు ఆయనకు ఆత్మక్షోభ కలిగిస్తాయని పేర్కొన్నారు. మహిళల భద్రత మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. మహిళలు పనిచేసే ప్రాంతాల్లో వారు సురక్షితంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులకు చట్టపరమైన శిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల హక్కులు, వారి గౌరవాన్ని కాపాడే విధానాలు, చట్టాలను రూపొందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు.

సింహగిరిపై యూత్ హాస్టల్స్ బృందం ట్రెక్కింగ్



ట్రెక్కింగ్‌లో పాల్గొన్న యూత్ హాస్టల్స్ బృందం

సింహాచలం,ఆగస్టు 18 : యూత్ హాస్టల్స్ ఆఫ్ ఇండియా విశాఖ బృందం సింహగిరిపై ఆదివారం ట్రెక్కింగ్ నిర్వహించారు. ఉదయం నగరంలోని లీలామాధవ స్వామి ఆలయం వద్ద ఉన్న మెట్లమార్గంలో వైహెచ్ఏ విశాఖ యూనిట్ అధ్యక్షుడు పుండరీకాక్షయ్య జెండా ఊపి ట్రెక్కింగ్‌ను ప్రారంభించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ట్రెక్కింగ్‌లో నగరానికి చెందిన హిందుస్థాన్ షిప్‌యార్డు, విశాఖ పోర్టు ట్రస్టు, హెచ్‌పీసీఎల్ తదితర కర్మాగారాలకు చెందిన కార్మికులు, 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, తదితరులు 50 మంది సుమారు రెండు గంటల పాటు ఉల్లాసంగా పాల్గొన్నారు.

యువతకు కృష్ణ తత్వాన్ని బోధించడమే లక్ష్యం



పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న వివిధ పాఠశాలల చిన్నారులు

సాగర్‌నగర్, ఆగస్టు 18 : నేటి తరానికి కృష్ణతత్వాన్ని బోధించడమే లక్ష్యంగా ఇస్కాన్ విశాఖపట్నం శాఖ పని చేస్తోందని ఇస్కాన్ విశాఖ అధ్యక్షుడు సాంబదాసు అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన, డ్రాయింగ్, కృష్ణలీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోక పారాయణాలు, పూల అలంకరణ, రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలకు 3500 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. మాతాజీ నితాయిసేవని, ఇస్కాన్ జీవితకాల సభ్యులు పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు ఇస్కాన్‌లో ఈనెల 24 నుంచి 27 వరకు జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో బహుమతులు అందజేస్తారు.

60 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం, ఆగస్టు 18 : పద్మనాభం సచివాలయంలో విజయనగరం క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రి వైద్యుడు బొడ్డు శివాజీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 60 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివాజీ మాట్లాడుతూ కీళ్ల వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదన్నారు. మోకాలి చిప్పలు అరిగిపోయిన వారికి, కాళ్లు వంకర్లు పోయిన వారికి మెరుగైన వైద్య సదుపాయాలు వచ్చాయని వాటితో ఉపశమనం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పద్మనాభస్వామి, పద్దు, సూరిబాబు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుని మాస జయంత్యుత్సవం



తిరువీధిలో నీరాజనమిస్తున్న అర్చక స్వామి

సింహాచలం, ఆగస్టు 18 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో నృసింహుని మాస జయంతి పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ప్రత్యేక ఉత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ఆస్థాన మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పల్లకిలో స్వామివారిని సింహగిరి మాడ వీధుల్లో ఊరేగించారు. తిరువీధి సందర్భంగా ఆలయ విద్వాంసులు సన్నాయి వాయిద్యాలు మోగించగా, పండితులు వేదమంత్రోచ్ఛారణలు, భక్తుల గోవిందనామస్మరణ మధ్య ఉత్సవం వైభవంగా జరిగింది.

జూపార్కులో 'వృక్షా బంధన్'

ఆరిలోవ, ఆగస్టు 18 : పర్యావరణ పరిరక్షణకు వృక్షా బంధన్ దినోత్సవం దోహదపడుతుందని జూపార్కు డిప్యూటీ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జి.మంగమ్మ అన్నారు. ఆదివారం జూపార్కులో మర్రిచెట్టుకు రాఖీ కట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వృక్షాలను రేపటి తరాలకు వారసత్వ సంపదగా గుర్తించి కాపాడుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూపార్కు, గ్రీన్ క్లైమేట్ సంస్థ సంయుక్తంగా వృక్షా బంధన్ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకుడు జేవీ రత్నం మాట్లాడుతూ నగరంలో వందేళ్లపైబడిన చెట్లకు 2008 నుంచి ఏటా రాఖీలు కడుతున్నామన్నారు.ఈకార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్ గోపాల నాయుడు, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్స్ నూతన కార్యవర్గం

సిరిపురం, ఆగస్టు 18 : కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడు కృష్ణారావు అధ్యక్షతన విశాఖ బ్రాంచ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నగరంలో జరిగింది. అధ్యక్షుడిగా కేజీహెచ్ ల్యాబ్ టెక్నీషియన్ శంకరరావును ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఓటింగ్ ద్వారా బీఎస్ ప్రసాద్‌రావు సెక్రటరీగా, కోశాధికారిగా నాగిరెడ్డి, కార్యవర్గం గౌరవ అధ్యక్షుడి రావు, లీగల్ సలహాదారుడిగా జడ శ్రావణ్‌కుమార్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం మూడేళ్ల పాటు అధికారంలో ఉంటుందని రాష్ట్ర నాయకులు తెలిపారు.

మిషన్ గ్రీన్ భీమిలి ఉద్యమానికి నేవీ సహకారం



సీడ్ బాల్స్, విత్తనాలను నేవీ వాహనానికి అందించిన మిషన్ గ్రీన్ భీమిలి ప్రతినిధులు

భీమునిపట్నం, ఆగస్టు 18 : భీమిలిని పచ్చదనంతో నింపాలన్న లక్ష్యంతో ప్రారంభించిన మిషన్ గ్రీన్ భీమిలికి ఇండియన్ నేవీ సహకారం అందింది. మిషన్ గ్రీన్ భీమిలి ప్రతినిధులు డాక్టర్ ముమ్మిడిశెట్టి ఆదిత్య, గుల్లల వెంకటేష్, తదితరులు ట్రస్ట్ లక్ష్యాన్ని కలెక్టర్‌ను కలిసి వివరించారు. ఆయన అనుమతితో నేవీ అధికారులు హెలీకాప్టర్ ద్వారా విత్తనాలు, సీడ్ బాల్స్‌ను భీమిలి ప్రాంతంలో వున్న సౌమ్యగిరి, కొత్తవలస కొండ, పరిసర ప్రాంతాల్లో జల్లడానికి అంగీకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ 81,500 కు పైగా సీడ్ బాల్స్ కోటికి పైగా వివిధ రకాల విత్తనాలను తమ సంస్థకు వచ్చిన నేవీ వాహనానికి అందించామన్నారు. వీటిని భీమిలిలోని కొండలు, ఖాళీ ప్రదేశాల్లో హెలీకాప్టర్ ద్వారా సీడింగ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ముమ్మిడిశెట్టి సత్యానందరావు, శ్రీనివాసరావు ముసునూరి, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

క్రీడాకారులకు ఎమ్మెల్యే వెలగపూడి అభినందనలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 18 : విజయనగరంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ క్యూర్గి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అభినందించారు. ఆదివారం వారు ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆరిలోవ బాబా తైక్వాండో అకాడమీకి చెందిన క్రీడాకారులు ఆర్. ఫనీష్ శ్రీరామ, కె. షర్మిల, ఎం. సాయిదీప్తి, పి. ప్రియమణి, ఎ. డైవిషిస్, కె. మేఘన, కె. రేవంత్, ఎస్‌కే జాస్మిన్ జహేరాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 12 వార్డు ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు, 11 వార్డు ఇన్‌ఛార్జి రాగతి అచ్యుతరావు, హెడ్ కోచ్ షేక్ అలీ, కోచ్‌లు ఈశ్వరరావు, కె. సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ కార్యాలయ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

కొమ్మాది, ఆగస్టు 18 : వాకర్స్ సభ్యులు సొంత భవనం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన పీఎంపాలెం తులసీనగర్ పార్కు సమీపంలో వాకర్స్ ఇంటర్నేషనల్ నిర్మించిన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ పీఐపీ ఏఎస్ఎన్ ప్రసాద్, కో-ఆర్డినేటర్ చెలకాని సీతారామయ్య, ఐపీఐపీ డాక్టర్ పి. రవీంద్ర,టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, దాసరి శ్రీనివాస్, గరె గురునాథ్, పోతిన రఘు, చిక్కాల విజయ్‌బాబు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌కు సందర్శకుల తాకిడి



సందర్శకులతో కిటకిటలాడుతున్న తీరం

సాగర్‌నగర్, ఆగస్టు 18 : రుషికొండ బీచ్ సందర్శకులతో ఆదివారం కళకళలాడింది. వేసవిని తలపించేలా ఎండలు ఉండడంతో నగరం నలుమూలల నుంచి పర్యాటకులు బీచ్‌కు తరలివచ్చి సేదతీరారు.కొందరు సముద్రంలో స్నానాలు చేస్తూ.. మరికొందరు ఇసుక తెన్నెల్లో ఆటలు ఆడుతూ సందడిగా గడిపారు. అలాగే ఏపీటీడీసీ ఆధ్వర్యంలోని బోటు షికారులో కొందరు ఉల్లాసంగా తిరిగారు. మెరైన్ టవర్ వద్ద హెచ్చరికలు జారీ చేసే మైక్ పనిచేయకపోవడంతో లైఫ్‌గార్డులు విజిల్స్ వేస్తూ సందర్శకులు ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తం చేశారు.

జూ పార్కు కిటకిట

ఆరిలోవ : నగరంలోని జూపార్కుకు సందర్శకుల తాకిడి పెరిగింది. సుమారు మూడు వేల మంది జూను సందర్శించగా వారి వద్ద నుంచి రూ.2.98 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ నందనీ సలారీయా తెలిపారు.

ఆనందపురంలో పూర్వ విద్యార్థుల కలయిక



ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కలిసిన పూర్వ విద్యార్థులు

ఆనందపురం, ఆగస్టు 18 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2012-2013 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. పాత స్నేహితులంతా ఒకచోట కలుసుకుని అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అలాగే తమకు విద్యా బుద్ధులు నేర్పిన అప్పటి హెచ్‌ఎం రుత్తల సన్యాసిరావు, ఉపాధ్యాయులు కె. రామకృష్ణ పట్నాయక్ తదితరులను సన్మానించారు.

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు



ఆనందపురం ప్రధాన రహదారిపై కుక్కల గుంపు

ఆనందపురం, ఆగస్టు 18 : మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడికక్కడే గుంపు గుంపులుగా చేరి పాదచారులు, వాహనదారులపై దాడికి పాల్పడుతున్నాయి. కుక్కల స్వైరవిహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వేములవలస, ఎల్‌వీ పాలెం, ఆనందపురం, చందక, పొడుగుపాలెం, వెల్లంకి పంచాయతీల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది.ఎల్‌వీపాలెం పంచాయతీలోని నేల్తేరులో ఆదివారం మామిడి కొమ్మలు తీయడానికి వెళ్తున్న బంక అప్పలనాయుడుపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గ్రామాల్లో ఇటువంటి సంఘటనలు అనేకం జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.